# పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 193 | విశాఖపట్నం | 14-4-2026 మంగళవారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 193 | VISAKHAPATNAM | 14-4-2026 TUESDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



SBI
PATHAKAM NEWS
SCAN & PAY
UPI ID: 44576280686@sbi
BHIM UPI yono SBI Pay G Pay Paytm


### ప్రజల భద్రత, పర్యావరణంపై జాగ్రత్తల విషయంలో

# రాజీ పడొద్దు: చంద్రబాబు



**అమరావతి, పతాకం న్యూస్:** మే నెలాఖరులోగా డి-రెగ్యులేషన్ ఫేజ్-2 అమల్లోకి వచ్చేలా చూడాలని ఆ మేరకు ఆర్డినెన్సులు తీసుకురావాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ నేతృత్వంలోని కేంద్ర ప్రతినిధి బృందంతో సీఎం భేటీ అయ్యారు. కేంద్ర ప్రతిపాదిత డీ-రెగ్యులేషన్ ఫేజ్-2 విధానాలపై సమీక్షించారు. పరిశ్రమల ఏర్పాటులో వేగం, అనుమతుల్లో సులభతరం అనవసరపు పర్మిషన్ల నియంత్రణపై చర్చించారు. కేంద్రం రూపొందించిన ప్రతిపాదనలను స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ సీఎం ముందు ఉంచారు. స్టీల్ సెక్రటరీ ప్రతిపాదనలపై రాష్ట్రానికి చెందిన వివిధ శాఖల ఉన్నతాధికారులతోనూ సమీక్షించారు. 800కిపైగా ఉన్న నిబంధనలను 100 లోపునకు తీసుకురావాలని సీఎస్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి ఆదేశించారు. పర్మిషన్లు, లైసెన్సులను సింగిల్ డిజిట్‌కు పరిమితం చేయాలని సూచనలు చేశారు. ప్రజల భద్రత, పర్యావరణం వంటి అంశాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల విషయంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. వేధింపులు లేకుండా థర్డ్ పార్టీ తనిఖీలకు ప్రాధాన్యమివ్వాలని ఆదేశించారు. అటవీ చట్టాలను వీలైనంత మేరకు సరళీకరించాలని కేంద్ర బృందానికి సూచనలు చేశారు. ఫైర్ సేఫ్టీకి సంబంధించి నేషనల్ బిల్డింగ్ కోడ్ స్థానంలో (తరువాయి 2వ పేజీలో)



# మృత్యు గెడ్డలు

- **పెదబయలు మత్స్యగెడ్డలో మృతి చెందిన ముగ్గురు పిల్లలు**
- **తల్లిదండ్రులకు కడుపుకోత మిగులుస్తున్న ఘటనలు**

**అరకు జిల్లా, పతాకం న్యూస్:** మన్యంలోని గెడ్డలు మృత్యుకుహరాలుగా మారాయి. వేసవిలో స్నానాలకు వెళ్లిన చిన్నారులను పొట్టన పెట్టుకుంటున్నాయి. వర్షాకాలంలో గెడ్డ దాటుతుండగా ఉసురు తీస్తున్నాయి. తాజాగా పెదబయలు మండలం సీకరి పంచాయతీ పన్నేడా గ్రామానికి చెందిన ముగ్గురు బాలలు మత్స్యగెడ్డలో స్నానానికి వెళ్లి మృత్యువాత పడ్డారు. ఈ నేపథ్యంలో మన్యంలో గెడ్డల్లో ప్రమాదాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. ఏజెన్సీలో పెదబయలు, ముంచంగిపుట్టు, హుకుంపేట, డుంబ్రిగుడ, అనంతగిరి, అరకులోయ మండలాల్లోని గెడ్డల్లో జరిగిన ప్రమాదాల్లో పలువురు మృతి చెందడం ఆందోళన కలిగిస్తున్నది. ఈనెల రెండో తేదీన అనంతగిరి మండలం మల్లంగుమ్మి జలపాతంలో ముగ్గురు బాలికలు మునిగి మృతి చెందిన ఘటన మరువక ముందు పెదబయలు మండలం లకేపుట్టు సమీపంలోని మత్స్యగెడ్డలో స్నానాలకు వెళ్లిన ముగ్గురు బాలురు మునిగి ప్రాణాలు కోల్పోయారు. గిరిజన ప్రాంతంలోని యువత, బాలలు గెడ్డల్లో ఈత, స్నానాలు, చేపల వేట వంటివి కొత్తకాదు. కాని ఊహించని విధంగా పలు సందర్భాల్లో మునిగి ప్రాణాలు కోల్పోతున్నారు. ఆయా గెడ్డలు తాము నిత్యం స్నానాలు చేస్తున్నవే కాదా.. అనే ధీమా నేపథ్యంలో యువత అప్రమత్తంగా లేకపోవడం ప్రమాదాలకు కారణమని ఇటీవల జరిగిన ఘటనల్లో స్పష్టమైంది. అనంతగిరి, హుకుంపేట మండలాల సరిహద్దున ఉన్న మల్లంగుమ్మి జలపాతంలో ఆయా ప్రాంతాలకు చెందిన చిన్నా పెద్దా నిత్యం జలకాలాడడం సర్వసాధారణం. కానీ అనుకోని విధంగా బూర్జ పంచాయతీ జంబువలస గ్రామానికి చెందిన బాలికలు సాలేపు త్రిష(17), రత్నకుమారి(16) (తరువాయి 2వ పేజీలో)




ఏపీలో ఇంటర్ విద్యార్థులకు అలర్ట్.. ఈ వారమే ఫలితాలు విడుదల 2లో

## ఘోర రోడ్డు ప్రమాదంలో 11 మంది మృతి



4లో



'బ్యాక్ పెయిన్' మీకు వెన్నులో నొప్పిగా ఉందా? 6లో

## ముర్ముకు కృతజ్ఞతలు తెలిపిన లోకేశ్, ఎంపీలు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి శాశ్వత చట్టబద్ధత కల్పిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజముద్ర వేయడం చరిత్రాత్మకమని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్షను నెరవేర్చిన రాష్ట్రపతికి కృతజ్ఞతలు తెలిపేందుకు, మంత్రి లోకేశ్ నేతృత్వంలోని ఎన్డీఏ ఎంపీల బృందం సోమవారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ చారిత్రక నిర్ణయంతో "మా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్-మా రాజధాని అమరావతి" అని ప్రతి ఆంధ్రుడు గర్వంగా చెప్పుకునేలా చేశారని వారు హర్షం వ్యక్తం చేశారు.

### అధికారులపై తీరుపై విసిగిపోయి..

## ఉద్యోగులపై కారం చల్లిన వృద్ధురాలు



**విజయవాడ, పతాకం న్యూస్:** విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్య పరిష్కార వేదికలో కలకలం రేగింది. ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరుగుతుండగా ఓ వృద్ధురాలు అధికా రులపై కారం చల్లి నిరసన తెలపడం తీవ్ర కలకలం రేపింది. దీంతో అక్కడ ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనతో అక్కడున్న సిబ్బందితో పాటు ఫిర్యా దుదారులు అర్జీదారులు ఒక్కసారిగా విస్మయానికి గురయ్యారు. అధికారుల నిర్లక్ష్యం, రోజులు తరబడి కార్యాలయాల చుట్టూ తిరగడంపై విసిగిపోయిన బాధితురాలు ఈ సాహసానికి ఒడిగట్టారు. ఎన్టీఆర్ జిల్లాలోని నందిగామ మండలం అనాసాగరం గ్రామానికి చెందిన లక్ష్మీ తులసి అనే వృద్ధురాలు తన భూ సమస్యపై కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చారు. జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా తన కుటుంబానికి చెందిన వ్యవసాయ భూమిని ప్రభుత్వం తీసుకుందని అయితే అందుకు సంబంధించి రావాల్సిన పరిహారం మాత్రం ఇప్పటికీ అందలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గత 3 ఏళ్లుగా న్యాయం కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదని ఆమె వాపోయారు.



హర్మూజ్ జలసంధి వద్ద నిలిచిన 15 భారత నౌకలు 2లో

ఓటు కోసం బయోమెట్రిక్ విధానం... కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు 2లో




పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..
అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..
పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## ఓటు హక్కుపై వేటు!

భారత రాజ్యాంగాన్ని, స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని ఆచరణలోకి తేవడంలో న్యాయ వ్యవస్థ పాత్రను లోతుగా చదివి ఆకళింపు చేసుకున్న వారెవరికైనా సరే సుప్రీంకోర్టు నుంచి వచ్చిన మాటలు దిగ్భ్రాంతి కలిగిస్తాయి. పశ్చిమ బెంగాల్‌లో ప్రత్యేక సమగ్ర పరిశీలన (ఎస్.ఐ.ఆర్) వల్ల ఉత్పన్నమైన సమస్యను విచారిస్తున్న త్రిసభ్య ధర్మాసనం సభ్యులలో ఒకరైన న్యాయమూర్తి ఇలా అన్నారు: ”ఈ ఎన్నికలలో ఎవరైనా ఒకరు ఓటు చేయలేక పోయారంటే వారి హక్కు శాశ్వతంగా తొలగించబడిందని అర్థమా?”. రాజ్యాంగంలోనూ అదే విధంగా ఇదే సుప్రీంకోర్టు ఇచ్చిన ఎన్నెన్నో తీర్పులలోనూ ఓటు హక్కు రాజ్యాంగ హక్కుగా గుర్తించబడింది. అలాంటి హక్కుకు ఈ విధమైన సృజనాత్మక భాష్యం చెప్పడం విడ్డూరమే. దీన్ని మరోవైపు నుంచి చూస్తే ఓటు హక్కు అనేది సమయం గడువు తీరిపోయాక మాత్రమే సొమ్ము చేసుకోదగిన పోస్ట్ డేటెడ్ చెక్ వంటిదా? ‘సర్’ ప్రక్రియ పైన, ప్రత్యేకంగా పశ్చిమ బెంగాల్‌లో పరిస్థితి పైన ‘పీపుల్స్ డెమోక్రసీ’ పదేపదే విస్తారంగా వ్యాఖ్యానించింది. ప్రస్తుతం జరుగుతున్న శాసనసభ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల అర్హతలపై చర్చకు సుప్రీంకోర్టులో ప్రస్తుత విచారణ తెర దించింది. అయితే దీనివల్ల తుది పరిష్కారం లభించకపోగా ఒక రాజ్యాంగ మౌలిక ప్రశ్నపై అతి పెద్ద వివాదం మొదలైనట్టయింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యానాన్ని మరింత ముందుకు తీసుకుపోతున్నట్టుగా సుప్రీంకోర్టు పశ్చిమ బెంగాల్‌లో ‘సర్’ ప్రక్రియ తప్పుడు అమలుపై ఆమోద ముద్ర వేసింది. ఇప్పుడున్న ఓటర్ల జబితా నుంచి మొదట 60 లక్షల ఓట్లు తొలగించిన భారత ఎన్నికల సంఘం (ఇ.సి.ఐ) పశ్చిమ బెంగాల్‌లో మాత్రమే ఒక సరికొత్త పద్ధతిని అనుసరించింది. లక్షలాది ఓట్లను ‘తార్కిక తేడాల’ పేరిట పక్కనపెట్టింది. వీటిపై ప్రత్యక్ష పరిశీలన జరపడంగాక సాఫ్ట్‌వేర్‌లతో అల్‌గోరిథంల ఆధారంగా ఓటర్ల జాబితాలను పున:దర్శనం చేసింది. ఈ సందర్భంగా 60 లక్షల మంది ఓట్లు కోల్పోవడం ఓటర్ల రద్దు ఎంత విస్తృతంగా జరిగిందో అర్థంకావడానికి ఒక మచ్చుతునకగా వుంటుంది. 2002-03 నాటి ఓటర్ల జాబితాతో ముడిపెట్టి కొత్త జాబితా రూపొందించే ప్రక్రియ ఇది. అయితే అసలు ‘సర్’ ప్రక్రియ ఏ పేరిట మొదలుపెట్టారో అది వెనక్కు పోయి, తొలగింపు కోసం పరిశీలనకు పెట్టిన ఓట్ల సంఖ్య చాలా తక్కువేనని ఇ.సి.ఐ అభిప్రాయపడుతున్నది. అయితే ఈ అంచనా ఎలాంటి నిర్దిష్టమైన అధ్యయనంపై ఆధారపడిందేమీ కాదు. కేవలం రాష్ట్ర స్థాయి బిజెపి నాయకులు, అమిత్ షా వంటి వారి ప్రకటనల ప్రాతిపదికన చెబుతున్నది మాత్రమే. పశ్చిమ బెంగాల్ ఓటర్ల జాబితాలలో రోహింగ్యాలతో సహా మొత్తం కోటిన్నర మంది చొరబాటుదార్లు వున్నారని వారు రోజూ గగ్గోలు పెడుతున్నారు. కొత్తగా ఈ ”తార్కిక తేడాలు” అన్నది ఆందుకోసం కనిపెట్టిందే. ఈ కొత్త కొలబద్దతో సందేహాస్పదంగా కనిపించిన వారందరినీ ”తీర్పు కోసం నిరీక్షణ” జాబితాలో చేర్చారు. అంటే మొదటి దశ పరిశీలనను జయప్రదంగా పూర్తి చేసి జాబితాలో స్థానం పొందినవారిని తీర్పు కోసం నిరీక్షణ పేరిట మళ్లీ ప్రత్యేకంగా పెట్టడమంటే చాలా స్పష్టంగా తొలగింపు కోసం ముందే చేసిన నిర్ణయం అమలు చేస్తున్నారన్నమాట. ఏప్రిల్ ఆరున విచారణ క్రమంలో ఇ.సి.ఐ తరపు న్యాయవాది మాట్లాడుతూ సుమారు 27 లక్షల మంది ఓటర్లు పూర్తిగా నిరూపించుకోలేక పోయారని చెప్పారు. అంతకు ముందు మార్చి మూడవ వారంలో జరిగిన విచారణలో అత్యున్నత న్యాయస్థానం ఇప్పటికీ తమ ఓటు హక్కు పునరుద్ధరించుకోలేకపోయిన వారికోసం ప్రత్యేకంగా న్యాయ ట్రిబ్యునళ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. అయితే ఇదే విచారణలో మరో విషయాన్ని అధికారికంగా అంగీకరించారు. ట్రిబ్యునళ్లను నోటిఫ్ చేసినప్పటికీ ఇంకా పని ప్రారంభించవలసే వున్నదని తెలిపారు. ఓట్లు తొలగించబడిన వారు ఎంతో కష్టమైనప్పటికీ తమ రోజువారి జీతాలు కూడా వదులుకుని దూరాభారాలు ప్రయాణించి పరిశీలనా కేంద్రాలకు చేరుకున్నారు. అయినా వారి పేర్లను పునరుద్ధరించడం జరగలేదు. ఏప్రిల్ 6న సుప్రీంకోర్టు విచారణ తర్వాత తుది ఓటర్ల జాబితా ప్రక్రియ నిలిపేయడానికి అనుమతినిచ్చింది. మొత్తం ఓటర్ల సంఖ్యలో 12 శాతం అంటే సుమారు 91 లక్షల ఓట్ల తొలగింపునకు ఆమోద ముద్ర లభించింది. ఇది చాలా పెద్ద సంఖ్యలో తొలగింపు అని కోర్టు కూడా ఒప్పుకోక తప్పలేదు. అయితే దిగ్భ్రాంతి కలిగించే బాధాకరమైన సత్యం ఒకటుంది. అత్యున్నత న్యాయస్థానం ఓటరు రాజ్యాంగ హక్కు కన్నా ఇసిఐ ముందస్తు పథకంతో మొదలు పెట్టి అమలు చేసిన ఈ కసరత్తుకే అత్యధిక ప్రాధాన్యత కల్పించింది. పున:పరిశీలనకుగాక సామూహిక ఓట్ల రద్దు జరిగే పరిస్థితి తెచ్చిపెట్టింది. వంద మంది నేరస్తులు తప్పించుకున్నా ఒక నిర్దోషికి కూడా శిక్ష వేయకూడదన్న న్యాయ సూత్రాన్ని కోర్టులు గుర్తించే దేశం ఇది. ఇలాంటి దేశంలో ఒక్క వేటున ఇంత భారీ సంఖ్యలో ఓట్లను తొలగించడం పచ్చిగా రాజ్యాంగ ఉల్లంఘన చేయడమే. ఫరక్కా నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా వున్న మెహతాబ్ షేక్‌ను తిరిగి ఓటర్ల జాబితాలో చేర్చేలా అదే రోజు సుప్రీంకోర్టు జోక్యం చేసుకున్నప్పుడు, ”విచారణలో ఉన్నవి”గా వర్గీకరించే మొత్తం ప్రక్రియ ఎంత ఏకపక్షంగా ఉందో స్పష్టమైంది.

## శిథిలావస్థలో మత్స్యకారుల సామాజిక భవనం



**భీమిలి, పతాకం న్యూస్:** మత్స్యకారులు విశ్రాంతి పొందేందుకు, వలలు మరమ్మతు చేసుకునేందుకు ఉపయోగ పడేలా దాదాపు పదేళ్ల క్రితం జివిఎంసి 3వ వార్డు పోలమాంబ గుడి వద్ద నిర్మించిన సామాజిక భవనం శిథిలావస్థకు చేరుకుంది. భవనం ఎక్కడికక్కడ పెచ్చులూడి పోయాయి. ఈ భవనానికి సమీపంలో ఎగువపేట, బోయి వీధి ప్రాంతాల మత్స్యకారులు ఉంటున్నారు. చేపల వేటకు వెళ్లి అలసట పొందిన వీరు కొంత సమయం ఇదే సామాజిక భవనంలో విశ్రాంతి తీసుకునే వారు. వేట లేని సమయంలో ఇక్కడనే వలల మరమ్మతు పనులు చేసుకునే వారు. శిథిలావస్థకు చేరడంతో మత్స్యకారులెవ్వరూ ఈ భవనాన్ని వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడింది. మత్స్యశాఖ ఇప్పటికైనా స్పందించి ఈ భవనం మరమ్మతు పనులు చేపట్టాలని స్థానిక మత్స్యకారులు కోరుతున్నారు.

## ఓటు కోసం బయోమెట్రిక్ విధానం... కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** భారతదేశ ఓటింగ్ ప్రక్రియలో ఐరిస్ బయోమెట్రిక్, ఫింగర్ ప్రింట్ విధానాలను ప్రవేశపెట్టాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విచారించడానికి సుప్రీంకోర్టు అంగీకరించింది. పోలింగ్ కేంద్రాల్లో బయోమెట్రిక్ అమలు చేసేలా కేంద్ర ఎన్నికల సంఘానికి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. ఈ అభ్యర్థనపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. ఇప్పటికే కేరళ, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీలకు ఎన్నికలు పూర్తయ్యాయి. తమిళనాడులో ఏప్రిల్ 23న... పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, ఏప్రిల్ 29న రెండు విడతల్లో ఓటింగ్ జరగనుంది. ఈ క్రమంలో ప్రస్తుత ఎన్నికలకు ఈ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోలేమని స్పష్టం చేసింది. రానున్న కాలంలో జరగబోయే అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికలకు బయోమెట్రిక్ విధానం అమలు చేయడాన్ని పరిశీలించాల్సి ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ అంశంపై స్పందించాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, కేంద్ర ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది.

## లోక్‌సభకు సభ్యులందరూ హాజరావ్వాలి : విప్ జారీ చేసిన కాంగ్రెస్



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** మహిళా రిజర్వేషన్ చట్టానికి ప్రభుత్వం సవరణలు తీసుకురానున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశానికి లోక్‌సభ ఎంపీలందరూ సభకు హాజరు కావాలని కాంగ్రెస్ సోమవారం విప్ జారీ చేసింది. లోక్‌సభలోని కాంగ్రెస్ పార్టీ సభ్యులందరూ గురు, శుక్ర, శనివారాలు అనగా 2026 ఏప్రిల్ 16,17,18 తేదీలలో జరిగే సభకు హాజరవ్వాలి. 16వ తేదీ ఉదయం 11 గంటలకు ప్రారంభమైన సభ వాయిదా పడేవరకు తప్పనిసరిగా సభకు హాజరై పార్టీ వైఖరికి మద్దతు ఇవ్వాలని ఆ పార్టీ విజ్ఞప్తి చేసింది. దీనిని అత్యంత ముఖ్యమైనదిగా పరిగణించాలని పార్టీ జారీ చేసిన విప్‌లో పేర్కొంది.

## ఏపీలో ఇంటర్ విద్యార్థులకు అలర్ట్.. ఈ వారమే ఫలితాలు విడుదల



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్మీడియట్ పరీక్షలు రాసినటువంటి లక్షలాది మంది విద్యార్థులంతా ఫలితాల కోసం ఎంతో ఉత్కంఠతతో ప్రస్తుతం ఎదురుచూస్తున్నారు. అయితే ఈ ఫలితాలను ఈ వారంలోనే విడుదల చేసేందుకు ఇంటర్ బోర్డు సన్నాహాలు చేస్తోంది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పబ్లిక్ పరీక్షల ఫలితాలను ఈనెల 18 లేదా 19వ తేదీల్లో విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి మూల్యాంకనం పూర్తవడంతో ఫలితాల విడుదలకు సంబంధించిన ప్రక్రియ అనేది కొనసాగుతోంది. ఈ ప్రాసెస్ ఈనెల 16వ తేదీ నాటికి పూర్తయ్యే అవకాశం ఉంది. అయితే ఫిబ్రవరి 23వ తేదీ నుంచి మొదలైన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మార్చి 23వ తేదీ వరకు జరిగిన విషయం తెలిసిందే. ఈ ఏడాది ప్రథమ సంవత్సరంలో తీసుకొచ్చిన సంస్కరణల కారణంగా పరీక్షల నిర్వహణకు నెల సమయం పట్టింది. దీంతో మూల్యాంకనం పూర్తి కావడంతో కొద్దిగా ఆలస్యమైంది. తాజాగా ఈ ప్రక్రియ పూర్తికావడంతో ఫలితాలను అతి త్వరలోనే ప్రకటించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లు.. 21వ శతాబ్దపు నిర్ణయాల్లో కీలకమైనది : మోడీ



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** చట్టసభలల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెచ్చిన ‘నారీ శక్తి వందన్ అధియాన్’ను అమలు చేసేందుకు తీసుకున్న నిర్ణయం 21వ శతాబ్దపు భారత్ తీసుకున్న అతిపెద్ద నిర్ణయాలలో ఒకటని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. నేడు న్యూఢిల్లీలో విజ్ఞాన్ భవన్‌లో జరిగిన ‘నారీ శక్తి వందన్ సమ్మేళన్’లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. దేశ అభివృద్ధి ప్రస్థానంలో ఈ కీలక ఘట్టాల నడుమ భారతదేశం 21వ శతాబ్దపు అతిపెద్ద నిర్ణయాలలో ఒకదాన్ని తీసుకోబోతోంది. 21వ శతాబ్దపు ముఖ్యమైన నిర్ణయాలలో ఇది కూడా ఒక ముఖ్యమైన నిర్ణయం అని చెబుతున్నాను. ఈ నిర్ణయం నారీశక్తికి అంకితం చేయబడింది. గత దార్శనికతను వాస్తవ రూపంలోకి తీసుకొచ్చే, అలాగే సామాజిక న్యాయం, పరిపాలన, నిర్ణయాలలో కీలక భాగంగా మార్చే ఒక చర్యగా ప్రధాని మోడీ దీనిని అభివర్ణించారు. ఈ నిర్ణయం మహిళా శక్తికి, మహిళా శక్తి గౌరవానికి అంకితం చేయబడింది. మన దేశ పార్లమెంటు ఒక కొత్త చరిత్రను సృష్టించేందుకు దగ్గరలో ఉంది. గత భావనలను సాకారం చేసే ఒక కొత్త చరిత్ర అది. భవిష్యత్తు తీర్మానాలను నెరవేర్చేది. ఇది సమానత్వంతో కూడిన భారతదేశం కోసం ఒక తీర్మానం. ఇక్కడ సామాజిక న్యాయం కేవలం ఒక నినాదంగా కాకుండా మన పని సంస్కృతిలో, మన నిర్ణయ ప్రక్రియలో ఒక సహజ భాగంగా ఉంటుంది. రాష్ట్ర శాసనసభల నుండి దేశ పార్లమెంటు వరకు దశాబ్దాల నిరీక్షణకు తెరదించే సమయం ఆసన్నమైంది. అది ఏప్రిల్ 16,17,18 తేదీలు. ప్రజాస్వామ్య వ్యవస్థలలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలనే ఆవశ్యకతను దశాబ్దాలుగా ప్రతి ఒక్కరూ భావిస్తున్నారు. ఈ చర్చ దాదాపు నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతుంది. ఇందులో అన్ని పార్టీల, అనేక తరాల కృషి ఉంది. ప్రతి పార్టీ ఈ ఆలోచనను తనదైన రీతిలో ముందుకు తీసుకెళ్లింది. 2029 నాటికి మహిళా సాధికారత చట్టాన్ని అమలు చేయాలన్నది ఏకగ్రీవ డిమాండ్. ఈ అంశంపై ఏప్రిల్ 16 నుంచి పార్లమెంటు సమగ్ర చర్చలు జరుపుతుంది. దీన్ని ముందుకు తీసుకెళ్లేందుకు అన్ని పార్టీలు కలిసి పనిచేస్తాయి’ అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## హర్మూజ్ జలసంధి వద్ద నిలిచిన 15 భారత నౌకలు



**ఇరాన్:** హర్మూజ్ జలసంధి మీదుగా భారత్ రావాల్సిన 15 భారతీయ నౌకలు ప్రస్తుతం అక్కడే చిక్కుకుపోయాయి. హర్మూజ్‌ను పూర్తిగా దిగ్బంధిస్తామని అమెరికా హెచ్చరించడంతో పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు రాజుకున్నాయి. ఈ క్రమంలో అక్కడ వివిధ దేశాలకుచెందిన నౌకలు నిలిచిపోయాయి. భారత్‌కు చెందిన 15 నౌకల్లో ఎక్కువగా ఎల్ఎన్జీ, ఎల్పీజీ క్యారియర్లు, క్రూడాయిల్ ట్యాంకర్లతో పాటు ఒక కెమికల్ కంటైనర్ ఉందని తెలుస్తోంది. హర్మూజ్‌లో నిలిచిపోయిన వాణిజ్య నౌకలతో సమన్వయం చేసుకునేందుకు భారత నౌకాదళం ప్రయత్నిస్తోంది. ఇందుకోసం నౌకాదళానికి చెందిన ఆరు ఓడలు ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్ సమీపంలో మోహరించాయి. మన నౌకలను సురక్షితంగా హర్మూజ్ జలసంధిని దాటించేందుకు ఇవి సాయపడనున్నాయి. ఈ జలసంధి మార్గంలో మొత్తం 25 భారత నౌకలు ఉన్నాయి. అయితే అప్పటికే పది నౌకలు ఈ జలసంధిని దాటాయి. ఇరాన్ ఓడరేవులను సోమవారం నుంచి దిగ్బంధిస్తామని యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించడం తెలిసిందే. హర్మూజ్ మీదుగా నౌకల రవాణాను నిలిపివేయనప్పటికీ అగ్రరాజ్యం ప్రకటనతో ఈ జలసంధిలో నౌకల రవాణా నెమ్మదించింది. నౌకల రాకపోకల అకస్మాత్తుగా తగ్గినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి.

(మొదటిపేజీ తరువాయి)

## రాజీ పడొద్దు: చంద్రబాబు

రాష్ట్ర నిబంధనలు పెట్టాలని డబుల్ లైసెన్సింగ్ తరహా పద్దతులను తప్పించాలని చెప్పారు. ఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకుంటే జీవిత కాలం చెల్లుబాటు కావాలని అన్నారు. దరఖాస్తు నుంచి అనుమతుల వరకూ మొత్తం ప్రక్రియను ఆన్‌లైన్ చేయాలని సీఎం తెలిపారు. ఫేజ్-2 అమలు తర్వాత పరిశ్రమల అనుమతులకు ఏర్పాటుకు ఇప్పుడున్న ప్రక్రియలో 40 శాతం మేర సమయం తగ్గాలని అన్నారు. పరిశ్రమలకు అనుమతులు, నిబంధనలను సడలించే విషయంలో తమ ప్రతిపాదనలకంటే రాష్ట్రం చాలా ముందుందని కేంద్ర స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ అభిప్రాయపడ్డారు. తాము ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ స్థానంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని అమలు చేస్తున్నామని కేంద్ర బృందానికి వివరించారు. ప్రజలకు సేవలు అందించడం కోసం స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ విధానాన్ని అవలంభిస్తున్నట్టు సీఎం వెల్లడించారు. డి-రెగ్యులేషన్ ఫేజ్-3ను చేపడుతున్నారా అని స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్?ను సీఎం చంద్రబాబు అడిగారు. జూన్ నుంచి ఫేజ్-3పై పని చేస్తామని స్టీల్ సెక్రటరీ చెప్పారు. ఫేజ్-3లో టెక్నాలజీ అనుసంధానం, ఏఐ టూల్స్ వినియోగానికి పెద్ద పీట వేయాలని స్టీల్ సెక్రటరీకి సీఎం సూచనలు చేశారు. డేటా లేక్, రియల్ టైం డేటా, సీఎఫ్ఎంఎస్, అవేర్-2.0, వాట్సాప్ గవర్నెన్స్ వంటి వ్యవస్థలను తాము వినియోగిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు.

## మృత్యు గెడ్డలు

సాలేపు పవిత్ర(15) మల్లంగుమ్మిలో స్నానాలు చేస్తుండగా అకస్మాత్తుగా ముందుకు వెళుతూ అక్కడున్న గుమ్మిలో మునిగి మృతి చెందిన సంగతి తెలిసిందే. అలాగే తాజాగా ఆదివారం పెదబయలు మండలంలోని మత్స్యగెడ్డలోని పన్నెడ గ్రామానికి చెందిన ముగ్గురు బాలలు జి.హర్షిత్(10), కె.ప్రదీప్(10), పి.బబ్లూ(8) ఎప్పటిలాగానే సమీపంలోని మత్స్యగెడ్డలో సాన్నానికి వెళ్లారు. అయితే స్నానాలతోపాటు గెడ్డలోని చేపలను పట్టాలనే సరదాతో వారు మరింత ముందుకు వెళ్లిన క్రమంలోనే లోతుగా ఉన్న ప్రదేశంలో మునిగిపోవడంతోనే ప్రాణాలు కోల్పోయారని తెలుస్తున్నది. వాస్తవానికి గెడ్డలు, వాగులు ఎప్పుడూ ఒకే లోతు ఉండవు. ఆ విషయాన్ని గుర్తించని కారణంగానే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. భారీ వర్షాలకు గెడ్డల్లోని ప్రవాహాలు అధికమైన పలుమార్లు లోతు ఏర్పడడంతోపాటు అక్కడక్కడ గుమ్మిలు సైతం ఏర్పడతాయి. అయితే తాజా పరిస్థితులను కనీసం అంచనా వేయని వారు గతంలో మాదిరిగానే ఉందనేఆలోచనతో గెడ్డలో దిగడం, మునిగి ప్రాణాలు కోల్పోవడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో బాలికలు, చిన్నారుల మృతితో వారి తల్లిదండ్రులకు కడుపుకోత మిగల్చడం తీవ్ర ఆవేదనకు గురి చేసే అంశం.

# ఒకప్పుడు తాగునీటిని అందించి... ఇప్పుడు అధ్వాన్నంగా ఉన్న చెరువు



**పాయకరావుపేట, పతాకం న్యూస్:** ఒకప్పుడు పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరందించిన పట్టణంలోని పంచాయతీ చెరువు ప్రస్తుతం మురుగునీటితో అధ్వానంగా తయారైంది. పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ చెరువు గట్టు ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. స్థానిక మెయిన్‌రోడ్డులో పాత పంచాయతీ కార్యాలయం వెనుక ఉన్న ఈ చెరువుకు రెండున్నర దశాబ్దాల క్రితం వరకు పట్టణంలోని భూమి కాలువ నుంచి ఏటా వర్షాకాలంలో నీరు చేరేది. చెరువును ఆనుకుని ఉన్న సుమారు 20 ఎకరాలకు సాగునీరందడంతో పాటు పట్టణ ప్రజలకు తాగునీరందేది. అనంతర కాలంలో పట్టణ ప్రజలకు పంచాయతీ కొళాయిల ద్వారా రక్షిత మంచినీరు సరఫరా అవుతుండడంతో ఈ చెరువు చేపల చెరువుగా మారి పంచాయతీకి ఆదాయాన్ని సమకూర్చి పెట్టేది. అయితే అభివృద్ధి చెందుతున్న పాయకరావుపేట పట్టణానికి ఆ మేరకు డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో స్థానిక ముస్లింవీధి, శెట్టిబలిజవీధి తదితర ప్రాంతాల మురుగునీరు చెరువులో కలుస్తోంది. అప్పటి నుంచి ఈ చెరువు మురుగునీరు, చెత్తాచెదారం, వ్యర్థాలతో దారుణంగా తయారైంది. చెరువు మొత్తం పిచ్చి మొక్కలతో ఉనికి కోల్పోయింది. దీనికి తోడు పంచాయతీ చెరువును ఆనుకుని వున్న వ్యవసాయ భూములు ఇళ్ల స్థలాలుగా మారిపోగా, భూమి పంట కాలువ నుంచి చెరువుకు నీరు వచ్చే కాలువ కనుమరుగైంది. చెరువు గట్టు క్రమంగా ఆక్రమణల పాలవుతోంది. ఈ చెరువును పునరుద్ధరించి చుట్టూ గట్టును పార్కుగా అభివృద్ధి చేసేందుకు గతంలో పంచాయతీ పాలకవర్గం తీర్మానించినా ఇప్పటి వరకు ఆ దిశగా ఒక్క అడుగు కూడా పడలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువును అభివృద్ధి చేసి గట్టుపై ఆక్రమణలను తొలగించి పార్కుగా అభివృద్ధి చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.

## హైవే పనులు వేగవంతం చేయాలి



**పాడేరు, పతాకం న్యూస్:** జిల్లాలో జరుగుతున్న జాతీయ రహదారి 516ఈ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ టి.నిశాంతి నేషనల్ హైవే అథారిటీ అధికారులను ఆదేశించారు. పాడేరు-చింతపల్లి మార్గంలో జి.మాడుగుల మండలం ఉరుము ప్రాంతంలోను, పాడేరు బైపాస్‌కు జరుగుతున్న పనులను ఆమె పరిశీలించారు. అనంతరం అక్కడే హైవే అథారిటీ అధికారులతో ఆమె మాట్లాడారు. రోడ్డు పనులు జరుగుతున్న క్రమంలో ప్రజల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. పనులు నాణ్యతగా, వేగంగా జరగాలన్నారు. వర్షాలు కురిస్తే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడతాయని, అందువల్ల వర్షాకాలంలోపే బైపాస్ పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అయితే బైపాస్ పనులు ఈఏడాది నవంబరు నాటికి పూర్తి చేయగలమని ఇంజనీరు కలెక్టర్‌కు తెలిపారు. జిల్లాలో చేపడుతున్న జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించిన సంపూర్ణ వివరాలతో సోమవారం కలెక్టరేట్‌కు రావాలని కలెక్టర్ నిశాంతి హైవే అథారిటీ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సైట్ ఇంజనీర్ లోకేశ్, టెక్నికల్ టీం లీడర్లు శ్రీనివాస్, రవికుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. ప్రతి సోమవారం మండల స్థాయిలో మీకోసం కార్యక్రమాన్ని విధిగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ టి.నిశాంతి అధికారులను ఆదేశించారు. ఆమె క్యాంప్ కార్యాలయం నుంచి వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. మండల స్థాయిలో సోమవారం నిర్వహించే మీకోసం కార్యక్రమంలో మండల స్థాయి అధికారులందరూ విధిగా హాజరుకావాలన్నారు. ఎట్టిపరిస్థితుల్లో అధికారులు గైర్హాజరు కాకూడదన్నారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించి, వాటిని ఆయా శాఖల అధికారులకు బట్వాడ చేయాలన్నారు. ఆయా శాఖల అధికారులు వాటిని పరిశీలించి పక్కాగా పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో జిల్లాలోని 11 మండలాలకు చెందిన ప్రత్యేకాధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 69 కిలోల గంజాయి పట్టివేత



**కొయ్యూరు, పతాకం న్యూస్:** ఒడిశా నుంచి తమిళనాడుకు ఆటోలో తరలిస్తున్న 69 కిలోల గంజాయిని కొయ్యూరు పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేయగా.. మరికొందరు పరారయ్యారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.35 లక్షలు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. ఇందుకు సంబంధించి సీఐ శ్రీనివాసరావు అందజేసిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బూదరాళ్ల మీదుగా మైదాన ప్రాంతానికి గంజాయి రవాణా జరుగుతున్నట్టు కొయ్యూరు ఎస్ఐ పి.కిశోర్‌వర్మకు ముందస్తు సమాచారం అందింది. దీంతో శనివారం రాత్రి సిబ్బందితో కలిసి ఎస్ఐ చీడిపాలెం కూడలిలో వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో బూదరాళ్ల నుంచి వస్తున్న ఆటోను ఆపేందుకు ప్రయత్నించగా.. అందులో ఉన్న వ్యక్తులు పారిపోయేందుకు యత్నించారు. దీంతో పోలీసులు ఆటోను అదుపులోకి తీసుకుని పారిపోతున్న వారిని వెంబడించి ఇద్దరుని పట్టుకున్నారు. పట్టుబడిన వారిలో ఒడిశా రాష్ట్రానికి చెందిన తాళే కోటిబాబు, పడియామి బచేల్‌ను విచారించగా.. ఆటోలో రహస్య అరలు ఏర్పాటు చేసి గంజాయిని ఒడిశా నుంచి సామర్లకోట రైల్వే స్టేషన్‌కు తీసుకువెళుతున్నామని, అక్కడి నుంచి తమిళనాడు తరలిస్తున్నట్టు తెలిపారు. దీనిపై ఆటో పరిశీలించగా.. అందులో 69 కిలోల గంజాయి పట్టుబడిందన్నారు. పరారయ్యారైన వారి కోసం గాలిస్తున్నామని సీఐ శ్రీనివాసరావు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.35 లక్షలు ఉంటుందని, పట్టుబడిన ఇద్దరు వ్యక్తులపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరుస్తున్నట్టు చెప్పారు.

## హక్కులు కాపాడుకునేందుకు పోరాటం

**గాజువాక, పతాకం న్యూస్:** భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకునేందుకు బహుజనులు ఇప్పటికీ పోరాటం చేయాల్సి రావడం దురదృష్టకరమని ప్రముఖ రచయిత, సామాజిక విశ్లేషకులు అరుణ గోగులమండ అన్నారు. జ్యోతిరావు పూలే, బిఆర్.అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ జయంతుల సందర్భంగా ఉక్కునగరంలోని అంబేద్కర్ కళాక్షేత్రంలో 'భారత రాజ్యాంగం మత స్వేచ్ఛ' అంశంపై సదస్సు నిర్వహించారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తిరుకోటి చిరంజీవి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు ముఖ్య వక్తగా అరుణ గోగులమండ హాజరై మాట్లాడుతూ, సనాతన ధర్మం పేరుతో బడుగు, బలహీన వర్గాలను అణచివేసిన సామాజాన్ని ప్రశ్నిస్తూ సామాజిక న్యాయం కోసం ఆ మహనీయులు చేసిన అవిశ్రాంత పోరాట ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న హక్కులని ఆమె ఉద్ఘాటించారు.

## రాళ్లు తేలిన రోడ్లతో అవస్థలు



**సబ్బవరం, పతాకం న్యూస్:** మండలంలోని పలు రహదారులు అధ్వానంగా ఉన్నాయి. రాళ్లు తేలి రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. మండలంలోని పినగాడి- కోటపాడు రోడ్డు నుంచి అయ్యన్నపాలెం శివారు బుదిరెడ్లపాలెం, ఎల్లుప్పి, ఎల్లుప్పి శివారు మర్రిపాలెం వెళ్లే రహదారి, పినగాడి-కోటపాడు రోడ్డు నుంచి అయ్యన్నపాలెం శివారు కిల్లవానిపాలెం వెళ్లే రహదారులు దారుణంగా ఉన్నాయి. దీంతో నిత్యం ఈ మార్గాల్లో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మర్రిపాలెం, ఎల్లుప్పి వెళ్లే రోడ్డు పలు చోట్ల గోతులు ఏర్పడి రాళ్లు తేలి ఉండడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కిల్లివానిపాలెం వెళ్లే రహదారికి 2019లో పీఎంజీఎస్‌వై కింద కోటి రూపాయలు మంజూరు కాగా, అప్పటి టీడీపీ ప్రభుత్వం రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించింది. దాదాపు చివరి దశకు చేరుకునేలోగా ఎన్నికలు వచ్చి ప్రభుత్వం మారిపోయింది. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఈ రోడ్డు పనులు నిలిచి పోయాయి. అప్పటి నుంచి దాదాపు ఏడేళ్లుగా రాళ్లు తేలిన రోడ్డుపైనే కిల్లవానిపాలెం ప్రజలు రాకపోకలు సాగిస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కిల్లవానిపాలెం రోడ్డు పరిస్థితి దారుణంగా ఉండడంతో వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లు బాగు చేయాలని కోరుతున్నారు.

## కాలిబాట వంతెన పూర్తయ్యేదెన్నడో?



**కశింకోట, పతాకం న్యూస్:** మండలంలోని గవరపేట ప్రాంత రైతులకు శారదానదిపై కాలిబాట వంతెన నిర్మాణం కలగానే మిగిలిపోతోంది. గత వైసీపీ ప్రభుత్వం వంతెన నిర్మాణ పనులు ప్రారంభించినా నిధులు విడుదలకాక అర్ధంతరంగా నిలిచిపోయాయి. అప్పటి నుంచి పనుల్లో కదలిక లేదు. కూటమి ప్రభుత్వంలోనైనా వంతెన నిర్మాణం జరుగుతుందా? అని ఆశతో రైతులు ఎదురుచూస్తున్నారు. శారదానది అవతలి వైపు గవరపేటకు చెందిన రైతుల వందలాది ఎకరాల భూములు, పాడి ఉన్నాయి. వీరంతా శతాబ్ద కాలంగా తాటిదోనె సహాయంతో నిత్యం పొలాలకు వెళుతున్నారు. ఏడాదిలో 8 నెలల పాటు శారదానదిలో నీటి ప్రవాహం అధికంగా ఉంటుంది. ప్రాణాలకు తెగించి వీరంతా దోనెలో నది దాటుతున్నారు. పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించుకోవడంతో గత టీడీపీ ప్రభుత్వంలో అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. అనుమతి వచ్చేలోగా ఎన్నికలు వచ్చి ప్రభుత్వం మారిపోయింది. 2020 జనవరి 9న గత వైసీపీ ప్రభుత్వం రూ.3 కోట్లు నిధులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించడంతో అప్పటి ఆ పార్టీ ఎమ్మెల్యే వంతెన పనులకు శంకుస్థాపన చేశారు. తొలుత రూ.50 లక్షలు విడుదల చేయడంతో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. అయితే వంతెనకు 16 పిల్లర్లకు బదులు 11 మాత్రమే కొంత మేర నిర్మించారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో పనులను నిలిపివేశారు. అప్పటి నుంచి పనుల్లో కదలిక లేదు. కూటమి ప్రభుత్వంలోనైనా పనులు పూర్తి చేస్తారేమోనని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## అటిజంపై దివీస్ అవగాహన ర్యాలీ

**విశాఖపట్నం, పతాకం న్యూస్:** దివీస్ లేబొరేటరీస్ ఆధ్వర్యాన విశాఖపట్నం ఆర్‌కె.బీచ్‌లో అటిజంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ దేవేందర్, వైస్ ప్రెసిడెంట్ ఎల్‌వి.రమణ, 600 మంది ఉద్యోగులతో కలిసి ర్యాలీ చేపట్టారు. ముఖ్య అతిథిగా విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అటిజం అనేది ఒక సంక్లిష్టమైన నాడీ సంబంధిత అభివృద్ధి లోపం అని, ఇది ప్రధానంగా జన్యుపరమైన కారకాలు, మెదడు అభివృద్ధిలో తేడాలు, పర్యావరణ ప్రభావాల కలయిక వల్ల వస్తుందని దివీస్ ఫౌండేషన్ ఫర్ గిఫ్టెడ్ చిల్డ్రన్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రమోద్ తెలిపారు. గర్భధారణ సమయంలో ఎదురయ్యే సమస్యలు కూడా కారణంగా ఉండవచ్చని పేర్కొన్నారు. అటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ అనేది బాల్యంలోనే ప్రారంభమయ్యే ఒక మానసిక రుగ్మత అని, దీనికి రోగ నిర్ధారణ అవసరమని పేర్కొన్నారు. శ్రేయ ఫౌండేషన్ కార్యదర్శులు ఉషా దేవి, సుదీష మాట్లాడుతూ, అటిజం లక్షణాలను గుర్తించడం ద్వారా తల్లిదండ్రులు, బాధితులకు చిన్నతనం నుంచే అవసరమైన మద్దతును అందించగలరని తెలిపారు.

## ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేసిన సభ్యులు




**దేవరాపల్లి, పతాకం న్యూస్:** విఓఎలు డ్వాక్రా గ్రామ ఐక్య సంఘాల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తు సోమవారం దేవరాపల్లిలో రైవాడ అతిథి గృహం నుండి తహశీల్దార్ కార్యాలయం మీదుగా,ఎంపిడివో కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ కార్యాలయం ఎదుట దర్నా చేసి తహశీల్దార్, ఎంపిడివోకు వినతిపత్రాలు సమర్పించారు. అనంతరం సభ్యులు మాట్లాడుతూ, ఇటీవల గ్రూపు సభ్యులందరూ ఎస్ఆర్ఎస్ యాప్ ద్వారా 80 శాతం సభ్యులు హాజరవ్వాలనే నిబంధనవలన సభ్యులందరు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అత్యధిక మంది రోజు వారీ కూలి పనులు చేసుకునే వారు అని తెలిపారు. ఉదయాన్నే వెళ్లి రాత్రికి ఇళ్లకు చేరుకుంటు న్నారని తెలిపారు. కొంత మంది ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి కొన్ని రోజులు పనులు చేసుకుని తిరిగి వస్తున్నారు అని పేర్కొన్నారు. కొంత మంది పట్టణాల్లో వివిధ పనులు చేసుకుంటూ, నెలలో కొన్ని రోజులు తరువాత గ్రామాలకు వస్తున్నారనీ ఈ నేపథ్యంలో విఓఏల ద్వారా ఎఫ్.ఆర్.ఎస్. హాజరు కోసం ఒకే దగ్గర అందరం ఒకే సమయంలో సమావేశం కావడం కుదరడం లేదన్నారు. కాబట్టి ఎఫ్.ఆర్.ఎస్.యాప్ పద్ధతిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే 10 లక్షల రూపాయల వరకు వడ్డీ రాయితీ ఇస్తామని ప్రభుత్వ ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. గతంలో అభయ హస్తం కంటే 60 ఏళ్ళు దాటిన వారికి పెన్షన్ ఇస్తామని చెప్పి ప్రభుత్వశీ ఇవ్వలేదన్నారు.అలాంటి వాళ్లకు పెన్షన్ ఇచ్చే ఏర్పాటు చెయ్యాలి. లేదంటే వారు చెల్లించిన అభయ హస్తం సొమ్మును వడ్డీతో సహా తిరిగి చెల్లించాలని డిమాండ్ చేసారు. వీటితో పాటు స్వావలంభన ఇన్సూరెన్స్ పేరుతో, మహిళా మార్టుల పేరుతో వసూలు చేసిన డబ్బులతో మార్టులు పెట్టి యున్నారని తెలిపారు.వీటి ద్వారా వచ్చే ఆదాయంలో చెల్లి స్తామన్న ఇన్సెంటివ్లు ఎవ్వరికీ చెల్లించలేదన్నారు.కొన్ని చోట్ల మార్టులను మూసి వేశారు కాబట్టి చెల్లించిన మూల ధనాన్ని సభ్యులందరికీ తిరిగి చెల్లించాలని కోరారు అలాగే సంఘాలలోనే సభ్యులుగా ఉంటూ సంఘాల కార్య కలాపాలను నిర్వహిస్తున్న విఓఏలకు తక్కువ గౌరవ వేతనంతో నెట్టుకొత్తున్నారని తెలిపారు విఓఏలకు గత 3 నెలలుగా వేతనాలు లేక వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు సభ్యులుగా ఉంటూ ఈ వేతనం తప్ప వీరికి ఎటువంటి సౌకర్యాలు కల్పించ లేదన్నారు నిర్వహించడానికి 58 మొబైల్స్ ఇస్తా మన్నారని. ఈ మొబైల్తో పాటు సిమ్ కార్డు, రీచార్జ్ కూడా కల్పించాలని కోరారు.గ్రూపు ఇన్సూరెన్స్ సౌకర్యం డ్వాక్రా సభ్యుల విఓఏల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 27, 28 తేదీలలో కలెక్టర్ కార్యాలయం ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు డ్వాక్రా సభ్యులకు ఎఫ్.ఆర్.ఎస్. హాజరు పద్ధతిని రద్దు చేయాలి.10 లక్షల రూపాయల వరకు వడ్డీ రాయితీని వెంటనే అమలు చేయాలి. అభయ హస్తం కట్టిన వారికి 60 ఏళ్లు దాటిన అర్హులం దరికీ పెన్షన్ ఇవ్వాలి. లేదా వడ్డీతో సహా మా డబ్బును తిరిగి ఇవ్వాలి.స్వావలంభన, మహిళా మార్టుల పేరుతో మా నుండి వసూలు చేసిన డబ్బులను తిరిగి చెల్లించాలి.విఓఏల 3 నెలల బకాయి జీతాలు చెల్లించాలి.మొబైల్, సీమ్ కార్డు ఇచ్చి రీఛార్జ్ చేయించాలి. 10 లక్షల గ్రూపు ఇన్లెన్స్ స్కీమ్ వర్తింప చేయాలి.కోరారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి డి. వెంకన్న,సిఐటియు మండల కార్యదర్శి బి టి దొర, కె.సూరిబాబు,జి రాము, కె స్రుజన,జి వరలక్ష్మి, జి వెంకటి,టి.అప్పారావు, జి లావణ్య, డి జెమిని, వి.దేవి తదితరులు పాల్గొన్నారు,

## పోరాటం ఆపని సునీత.. మళ్లీ హైకోర్టుకు!



**అమరావతి, పతాకం న్యూస్:** వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అసలైన దోషులను బయటకు తీసుకురావాలన్న పట్టుదలతో ఆయన కుమార్తె డాక్టర్ సునీతా రెడ్డి తన న్యాయపోరాటాన్ని తీవ్రతరం చేశారు. సీబీఐ దర్యాప్తు తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ఆమె తాజాగా మరోసారి కోర్టు మెట్లు ఎక్కారు. వివేకా హత్య కేసులో సీబీఐ దర్యాప్తు తూతూమంత్రంగా సాగిందని సునీతా రెడ్డి ఆరోపిస్తున్నారు. ఇటీవలే సీబీఐ ప్రత్యేక కోర్టులో సమర్పించిన మూడవ అనుబంధ చార్జ్ షీట్‌లో కొత్తగా ఎలాంటి ఆధారాలు లేవని, కొత్త నిందితులెవరూ లేరని సీబీఐ పేర్కొనడంపై ఆమె మండిపడ్డారు. ఈ దర్యాప్తు కేవలం కాల్ డేటా రికార్డుల విశ్లేషణకే పరిమితమైందని, అసలు సూత్రధారులను వదిలేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ, సమగ్ర విచారణ కోరుతూ ఆమె ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గతంలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ కొన్ని అంశాలపై దర్యాప్తు చేపట్టినప్పటికీ, అది ఆశించిన స్థాయిలో లేదని సునీత వాదిస్తున్నారు. ముఖ్యంగా కీలక నిందితుల మధ్య జరిగిన ఫోన్ సంభాషణలు, అర్ధరాత్రి జరిగిన సందేశాల విషయంలో సీబీఐ ఇచ్చిన వివరణలను ఆమె తప్పుబడుతున్నారు. సమయం నమోదులో సాంకేతిక పొరపాట్లు జరిగాయని చెబుతూ సీబీఐ కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తోందని, బాహ్య శక్తుల ఒత్తిడి వల్లే దర్యాప్తు ఆగిపోయిందని ఆమె ప్రశ్నిస్తున్నారు. వివేకా హత్య వెనుక ఉన్న అసలైన కుట్రను ఛేదించడంలో దర్యాప్తు సంస్థలు విఫలమవుతున్నాయని సునీత ఆరోపణ. కేవలం కొందరు నిందితుల వాంగ్మూలాలను నమోదు చేసి సరిపెట్టుకున్నారని, కానీ ఈ హత్య వెనుక ఉన్న రాజకీయ కోణాలను, అసలు కుట్రదారులను పక్కన పెట్టారని ఆమె వాదిస్తున్నారు. తన తండ్రి చనిపోయిన రోజు నుంచి నేటి వరకు తను అడుగుతున్న ప్రశ్నలకు సరైన సమాధానాలు దొరకలేదని, అందుకే పోరాటం ఆపే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తున్నారు.

# నీటి ప్రవాహానికి శాశ్వత పరిష్కారం: రామ్మోహన్‌నాయుడు



**శ్రీకాకుళం, , పతాకం న్యూస్:** పెద్దపాడు నేషనల్ హైవే పై వర్షపు నీరు నిలువ ఉండకుండా శాశ్వత పరిష్కారంగా కల్వర్టర్ నిర్మిస్తామని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు నగరానికి అనుకొని పెద్దపాడ నేషనల్ హైవేపై 4 కోట్ల 65 లక్షల రూపాయలతో శాశ్వత కల్వర్టు నిర్మాణానికి ఎమ్మెల్యే జి శంకర్ కలిసి శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో పోర్టు ఎయిర్ కోర్టు రైల్వే రవాణా సంస్థలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని అన్నారు దీని ద్వారా జిల్లాకు పరిశ్రమలు వస్తాయని దానిద్వారా యువతకు ఉద్యోగాలు వస్తాయని అన్నారు ఆయనతోపాటు కలెక్టర్ స్వప్నల్ పుండరీకర్ పాల్గొన్నారు

## భీమిలి, ఆనందపురం, పద్మనాభం, పెందుర్తి మండలాల విలీనంపై సందిగ్ధం



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** జిల్లాలోని భీమిలి, ఆనందపురం, పద్మనాభం, పెందుర్తి మండలాలను జీవీఎంసీలో విలీనం చేయాలన్న ప్రతిపాదనపై అయోమయం నెలకొంది. నగర పాలక సంస్థ పరిధిలోని 98 వార్డులను 120 వార్డులకు పెంచే ప్రక్రియ ఒకవైపు శరవేగంగా సాగుతోంది. ఈ సమయంలో నాలుగు మండలాల విలీనానికి అసలు అవకాశం ఉందా?, లేదా?...అనే అంశంపై విస్తృత చర్చ నడుస్తోంది. విశాఖ జిల్లా గ్రామీణ ప్రాంతంలో ఆనందపురం, పద్మనాభం, భీమిలి, పెందుర్తి మండలాలు ఉన్నాయి. భీమిలి, పెందుర్తి మండలాల్లోని కొన్ని గ్రామాలు ఇప్పటికే జీవీఎంసీ పరిధిలో ఉన్నాయి. ఆ రెండు మండలాల్లో మిగిలిన పంచాయతీలతో పాటు ఆనందపురం, పద్మనాభం మండలాలను కూడా జీవీఎంసీలో విలీనం చేయాలని ఎమ్మెల్యే గంటాశ్రీనివాసరావు, పంచకర్ల రమేష్‌బాబు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఆ నాలుగు మండలాలను జీవీఎంసీలో విలీనం చేసే ప్రతిపాదనను పరిశీలించాలని జీవీఎంసీని ప్రభుత్వం ఆదేశించింది. ఆ విషయాన్ని అధికారులు ఇంకా పరిశీలించకముందే జీవీఎంసీలోని 98 వార్డులను 120కి పెంచుతూ, వార్డుల విభజనను ఈనెల 26వ తేదీ నాటికి పూర్తిచేయాలని ఆదేశించింది. దీంతో టౌన్‌ప్లానింగ్ అధికారులు వార్డుల విభజన ప్రక్రియను చేపట్టారు. ఈ క్రమంలో ఆ నాలుగు మండలాల విలీనం లేనట్టేనని అందరూ భావించారు. కానీ, కేవలం నాలుగు మండలాల కోసం ప్రత్యేకంగా జిల్లా పరిషత్, డీఆర్‌డీఏ, వెల్ఫేర్ భవన్‌లను కొనసాగించడం సాధ్యం కాదని కొందరు అధికారులు చెబుతున్నారు. వాటిని పూర్తిగా జీవీఎంసీలో విలీనం చేయడం లేదంటే పద్మనాభం మండలాన్ని విజయనగరం జిల్లాలోనూ, భీమిలి,ఆనందపురం జీవీఎంసీలోనూ, పెందుర్తి మండలాన్ని అనకాపల్లి జిల్లాలో విలీనం చేయాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. అయితే ప్రస్తుతం దేశవ్యాప్తంగా జనగణన జరుగుతున్నందున, కేంద్ర ప్రభుత్వం నిబంధన ప్రకారం స్థానిక సంస్థల్లోకి కొత్త ప్రాంతాల విలీనానికి అవకాశం ఉండదని మరికొందరు అధికారులు స్పష్టంచేస్తున్నారు. దీంతో జిల్లాలోని నాలుగు మండలాల భవితవ్యం ఏమిటనే దానిపై సందిగ్ధం నెలకొంది.

## ఫేస్ యాప్ రద్దు చేయాలని కూలీల నిరసన




**వీరఘట్టం, పతాకం న్యూస్:** ఉపాధి హామీ పనుల్లో ప్రవేశపెట్టిన ఫేస్ యాప్ రద్దు చేయాలని మండలంలోని నర్సిపురం గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి కూలీలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వ్యకాస మండల కార్యదర్శి ఎన్.సింహాచలం మాట్లాడుతూ ఫేస్ యాప్ వల్ల ఉపాధి కూలీలు, మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఉపాధి హామీ చట్టాన్ని పాత పద్ధతిలో కొనసాగించాలని, పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్‌చేశారు. రెండు పూటల పని విధానాన్ని రద్దు చేయాలని, ప్రతి కుటుంబానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని కోరారు. రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లపై ఈ నెల 13న ఎంపిడిఒ కార్యాలయం వద్ద చేపట్టే ధర్నాలో కూలీలంతా అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదంలో 11 మంది మృతి



**మహారాష్ట్ర, పతాకం న్యూస్:** మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురుగా వస్తున్న ఒక సిమెంట్ మిక్సర్ వాహనాన్ని ప్రయాణికులతో వెళ్తున్న ఈకో వ్యాన్ ఢీకొన్న ఘటనలో 11 మంది మరణించారు. మరికొందరు గాయపడ్డారు. ఈ ఘటన థానే జిల్లా, కల్యాణ్-ముర్బాద్ నేషనల్ హైవే 61పై, గోవిలి గ్రామ సమీపంలోని రైతా బ్రిడ్జి వద్ద సోమవారం ఉదయం జరిగింది. 10.45 గంటల సమయంలో ఈకో వ్యాన్ కొంతమంది ప్రయాణికులతో కల్యాణ్ నుంచి ముర్బాద్ వెళ్తోంది. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న సిమెంట్ మిక్సర్ వాహనాన్ని వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో ఐదుగురు ప్రయాణికులు అక్కడికక్కడే మరణించారు. మిగతా ఆరుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. ఇంకా పలువురు గాయపడ్డారు. ఘటన సమాచారం అందుకున్న స్థానికులు, అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రుల్ని సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, ఎనిమిది మంది పురుషులు ఉన్నారు. వీరిలో ఇద్దరు కాలేజీ విద్యార్థులు కూడా ఉన్నారు. ఘటన జరిగిన ప్రదేశంలో దృశ్యాలు హృదయవిదారకంగా ఉన్నాయి. రెండు వాహనాలు ఒకదానిలోకి ఒకటి చొచ్చుకుపోయాయి. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు గుజరాత్‌లో జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మరణించారు. రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న యాత్రికులపైకి ఓ ట్రక్కు అదుపుతప్పి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఏడుగురు అక్కడికక్కడే మరణించారు.

## మెరుగైన జీవనమే లక్ష్యం



**గజపతినగరం, పతాకం న్యూస్:** ఎస్సి, ఎస్టిలకు మెరుగైన జీవన విధానం ఇవ్వడం, వారి ఉన్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పాతబగ్గాం గ్రామంలో పిఎం సూర్య ఘర్ ముఫ్తీ బిజిలీ యోజన కార్యక్రమంలో పాల్గొని రూఫ్‌టాప్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సూర్య ఘర్ పథకం ద్వారా కూటమి ప్రభుత్వం ఎస్సి, ఎస్టిలకు ఉచితంగా సోలార్ రూఫ్ టాప్ ప్యానల్స్‌తో పాటు ప్రతి నెలా అదనంగా రూ.200 కూడా ఇస్తుందన్నారు. తొలి విడతలో రూ.170 కోట్లతో 15,018 మంది లబ్ధిదారులకు ఈ పథకం వర్తింపజేస్తున్నామని, 30.04 మెగావాట్ల కరెంట్ జిల్లాలో ఉత్పత్తి చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలో 8,535 ఎస్సి, ఎస్టి లబ్ధిదారులు ఉంటే 2170 మందిని ఈ పథకం ద్వారా ఎంపిక చేశామన్నారు. విద్యుత్ ఉత్పత్తి పెంచుకుంటేనే యూనిట్ ధర తగ్గుతుందని, విద్యుత్ ఉత్పత్తి పెంచుకు నేందుకు ఈ పథకం ఉపయోగించుకోవాలని అన్నారు. సూర్య ఘర్ ఏర్పాటు చేసుకున్న వారికి మరో 25 ఏళ్ళ కరెంటు బిల్లులు భారం ఉండదన్నారు. గత ప్రభుత్వంలో విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తం ఇక గత ప్రభుత్వం అస్తవ్యస్త విధానాలతో యూనిట్ రూ.15కు కొని ప్రజలపై సర్‌చార్జీల పేరుతో అధిక బిల్లుల మోపారని మంత్రి విమర్శించారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లోనూ లోఓల్టేజ్ సమస్యతో ప్రజలు నానా ఇబ్బందులకు గురయ్యారని, కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే నియోజకవర్గంలో రూ.3కోట్లతో 130 కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో పాటు మరో రూ.3 కోట్లతో ఎలక్ట్రికల్ పోల్స్ కూడా మార్చుతున్నామని చెప్పారు. జిల్లా కేంద్రం విజయనగరంలో తీవ్రమైన లోఓల్టేజ్ సమస్య ఉన్నా గత ప్రభుత్వం ఏనాడు పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వం వచ్చాక స్థానిక ఎమ్మెల్యే అతిథి గజపతిరాజుతో కలిసి చంద్రబాబు దృష్టికి ఈ సమస్య తీసుకువెళ్లి రూ.180 కోట్లతో సబ్‌స్టేషన్ తీసుకువచ్చామన్నారు. గజపతినగరం నియోజకవర్గంలోని బొండపల్లి మండలంలో ఒక సబ్‌స్టేషన్‌తో పాటు నెల్లిమర్ల నియోజకవర్గంలో మరో రెండు సబ్‌స్టేషన్లు కూడా ఏర్పాటవుతుండడం కూటమి ప్రభుత్వ పాలనకు నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో గజపతినగరం జనసేన ఇన్‌చార్జ్ మర్రాపు సురేష్, ఎఎంసి చైర్మన్ గోపాలరాజు, గజపతినగరం టిడిపి మండల అధ్యక్షులు గంట్యాడ శ్రీదేవి, ఆంధ్రా రిజర్వాయర్ ఛైర్మన్ కోడి సతీష్‌కుమార్, పిఎసిఎస్ లెంక బంగారునాయుడు, క్లస్టర్ నాయకులు ప్రదీప్‌కుమార్, గోవింద, నారాయణ అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు. పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణఅమరజీవి పొట్టి శ్రీరాములు ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ కోసం చేసిన త్యాగం ఎప్పటకీ తెలుగు ప్రజల మదిలో ఉండిపోతుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. పాతబగ్గాం హైస్కూల్ ఆవరణలో పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసినందుకు జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులను మంత్రి అభినందించారు. రూ.73.60 లక్షలతో నిర్మించిన సీసీ రహదారులు, డ్రైనేజ్‌లను కూడా మంత్రి ప్రారంభించారు.

## శిథిలావస్థ భవనాలను తొలగించండి



**అనంతపురం, పతాకం న్యూస్:** నార్పల మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పాత భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని వాటిని తొలగించాలని పలువురు స్థానికులు కోరుతున్నారు. గతంలో జూనియర్ కళాశాల నిర్వహించే తరగతి గదులు శిథిలావస్థకు చేయడంతో విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి పూర్వ విద్యార్థులు కళాశాల అధ్యాపకులు ఆర్ డి టి సంస్థ సహకారంతో నార్పల జూనియర్ కళాశాలకు నూతన భవనాలను నిర్మింప చేశారు. అయితే శిథిలావస్థలో ఉన్నటువంటి ఆ భవనాలను అలాగే వదిలివేయడంతో ఆ భవనాలు ఉన్నట్లుండి పెచ్చులూడి గోడలు కింద పడుతున్నాయని ప్రస్తుతం త్వరలోనే వేసవికాలం సెలవులు ప్రారంభం కానున్నాయి. పాఠశాల, కళాశాల పిల్లలు అందరూ వివిధ ఆటలాడుతూ క్రీడా మైదానంలోనే ఎక్కువ ఉంటారని తెలిపారు. పిల్లలు ఆడుకునే సమయంలో పొరపాటున ఈ శిథిల భవనాల పెచ్చులు ఊడిపడి పిల్లలపై పడితే పెను ప్రమాదం సంభవించే అవకాశం ఉందని పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి శిథిల భవనాలను వెంటనే తొలగించాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

## పాము కాటుతో కేజీబీవీ విద్యార్థిని మృతి





**అచ్యుతాపురం, పతాకం న్యూస్:** అచ్యుతాపురం మండలంలో విషాదం చోటుచేసుకుంది. అచ్యుతాపురం కేజీబీవీలో 7వ తరగతి చదువుతున్న మైలపల్లి నవ్య (12) పాము కాటుకు గురై మృతి చెందింది. పాఠశాల ప్రాంగణంలోనే బాలికను పాము కరవడంతో వెంటనే అప్రమత్తమైన సిబ్బంది ఆమెను తొలుత అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ బాలిక ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు, బంధువులు పాఠశాల గేటు వద్ద ఆందోళనకు దిగారు. "పిల్లలను చదువు కోసం పంపిస్తే శవాలుగా పంపిస్తారా..?" అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. కేజీబీవీ వంటి ప్రభుత్వ నివాస పాఠశాలలో కనీస భద్రతా చర్యలు లేకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. పాఠశాల పరిసరాల్లో పొదలు, చెత్త పేరుకుపోవడం వల్లే పాములు సంచరిస్తున్నాయని ఆరోపిస్తున్నారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకుని ఉంటే ఈ ప్రాణనష్టం తప్పేదని అంటున్నారు. ఈ విషాద ఘటనతో కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలల్లో భద్రతపై మళ్లీ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వెంటనే సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఉత్తరాంధ్ర ట్రావెల్ హబ్‌గా భోగాపురం విమానాశ్రయం




**విజయనగరం, పతాకం న్యూస్:** శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు కేంద్ర బిందువుగా ఉన్న భోగాపురం విమానాశ్రయాన్ని అంతర్జాతీయ స్థాయిలో ట్రావెల్ హబ్ గా తీర్చిదిద్దేందుకు ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. దీనికి సంబంధించి అధికారుల వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖ ప్రస్తుత విమానాశ్రయాన్ని పూర్తిస్థాయి డిఫెన్స్ ఎయిర్పోర్ట్‌గా మారుస్తుండటంతో ప్రస్తుతం అన్ని రాకపోకలు భోగాపురం విమానాశ్రయం నుంచే జరిపేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. తొలుత దీనిని కార్గో రవాణాకు వినియోగించాలని ప్రతిపాదించినప్పటికీ నగరాలు పూర్తిస్థాయిలో విస్తరించడం మూడు జిల్లాలకు ఇది కేంద్రం కావడం తో పెద్ద సంఖ్యలో ట్రావెలర్స్ రాకపోకలు సాగిస్తారని అంచనా వేస్తున్నారు. ఏటా ఆరు మిలియన్ల మంది ప్రయాణికులు ఈ ఎయిర్పోర్ట్ ద్వారా రాకపోకలు సాగిస్తారని అంచనా వేశారు. అందుకు అనుగుణంగా ఎయిర్పోర్టును తీర్చిదిద్దుతున్నారు. జులై, ఆగస్టులలో తేదీలు ఖరారైన వేళ ప్రధాని మోడి చేతుల మీదుగా ఈ విమానాశ్రయాన్ని ప్రారంభించాలనే ప్రతిపాదనలో భాగంగా రోడ్డు రవాణాను మరింత మెరుగుపరిచే దిశగా మూడు జిల్లాలకు యాక్సిసబిలిటీ కల్పిస్తూ రహదారులను అనుసంధానం చేస్తున్నారు. ముఖ్యంగా ఎన్ హెచ్ 16 కు అనుసంధానం చేస్తూ పలుచోట్ల వంతెనలు నిర్మిస్తున్నారు .ఈ పనులన్నీ జూన్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ధారించుకున్నారు. ఏ జిల్లా నుంచి అయినా ఎయిర్పోర్టుకు గంట వ్యవధిలోపు చేరుకునే రీతిన రహదారులను అభివఅద్ధి చేయాలని సంకల్పంతో ఆయా జిల్లాల కలెక్టర్లు సమీక్షలు నిర్వహిస్తూ దీనిపై కార్యాచరణ రూపొందించారు. మొత్తం మీద ఉత్తరాంధ్ర జిల్లాలో ప్రజలకు ఇది ట్రావెల్ హబ్ గా తయారు కానుంది.

## వివాహిత బ్లాక్‌మెయిల్.. ప్రాణాలు తీసుకున్న ఫిట్‌నెస్ ట్రైనర్

**బెంగళూరు:** బెంగళూరులో విషాద ఘటన చోటుచేసుకుంది. ఓ వివాహిత వేధింపులు, బ్లాక్‌మెయిలింగ్ తాళలేక 28 ఏళ్ల జిమ్ ట్రైనర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. రాష్ట్రస్థాయి ఫిట్‌నెస్ ట్రైనర్ అయిన దిలీప్ (28) రాత్రి ఆలస్యంగా ఇంటికి వచ్చి తన గదిలోకి వెళ్లి తలుపు వేసుకున్నాడు. ఆ తర్వాత యోగిత అనే మహిళ నుంచి దిలీప్ సోదరికి ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక మెసేజ్ వచ్చింది. దిలీప్ ఆత్మహత్య చేసుకున్నట్లు ఆ మెసేజ్‌లో ఉండటంతో కుటుంబ సభ్యులు షాక్ అయ్యారు. వెంటనే గది తలుపులు బద్దలుకొట్టి చూడగా, దిలీప్ విగతజీవిగా కనిపించాడు. కుటుంబ సభ్యుల ఆరోపణల ప్రకారం.. దిలీప్‌కు జిమ్‌లో 42 ఏళ్ల వివాహితతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం చనువుగా మారడంతో, ఆమె డబ్బు, ఆస్తి కోసం దిలీప్‌ను బ్లాక్‌మెయిల్ చేయడం మొదలుపెట్టింది. గతంలో ఈ విషయం పోలీసుల వరకు వెళ్లగా, ఆమె భర్త సమక్షంలో ఇద్దరికీ రాజీ కుదిర్చారు. అయినప్పటికీ ఆమె వేధింపులు ఆపలేదని, నిరంతరం వేధించడంతోనే దిలీప్ ప్రాణాలు తీసుకున్నాడని కుటుంబం ఆరోపిస్తోంది.

## పురపాలక ఎన్నికల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లు!




**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్రంలో పురపాలక ఎన్నికల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లు మొదలయ్యాయి. 13 నగరపాలక సంస్థలు, 87 పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో డివిజన్లు, వార్డుల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. పాత, కొత్త డివిజన్లు, వార్డులకు 4 వైపులా హద్దులు నిర్ణయించాక ప్రాథమికంగా నోటిఫికేషన్ ఇచ్చి ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తారు. ఆపై మార్పులు, చేర్పులతో కలెక్టర్ ద్వారా ప్రభుత్వ తుది ఆమోదానికి పంపనున్నారు. పునర్విభజనతో డివిజన్లు, వార్డుల సంఖ్య 3,942కి పెరగనుంది. కొత్తగా 772 అందుబాటులోకి రానున్నాయి. రాష్ట్రంలో 12 నగరపాలక సంస్థలు, 75 పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో పాలకవర్గాల ఐదేళ్ల పదవీకాలం ఈ ఏడాది మార్చి 17తో ముగిసింది. మరో నగరపాలక సంస్థ, ఇంకో 12 పురపాలక, నగర పంచాయతీల్లో పాలకవర్గం పదవీకాలం నవంబరులో ముగియనుంది. పురపాలక ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం ఇప్పటికే సంకేతాలు ఇచ్చింది. ఆగస్టు, సెప్టెంబరులో ఎన్నికలు నిర్వహించాలన్న యోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే డివిజన్లు, వార్డుల పునర్విభజనకు నోటిఫికేషన్లు వేర్వేరుగా ఇటీవల జారీ చేసింది. ముందు నిర్ణయించిన ప్రకారం ఈ నెలాఖరుతో ప్రక్రియ పూర్తి చేయాలి. అధికారులు, సిబ్బంది జనగణన ఏర్పాట్లలో ఉన్నారన్న పురపాలక, నగరపాలక సంస్థల విజ్ఞప్తిపై వచ్చే నెలాఖరు వరకు గడువు పెంచారు. పునర్విభజనపై కొన్ని చోట్ల క్షేత్రస్థాయిలో రెండు రోజుల క్రితం పరిశీలన ప్రారంభమైంది. మిగిలిన చోట్ల రెండు, మూడు రోజుల్లో మొదలు కానుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం ప్రస్తుత ఒక్కో డివిజన్, వార్డుని రెండుగా విభజించొచ్చని అంచనా. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, తిరుపతి, కడప నగరపాలక సంస్థల్లో డివిజన్లు కొత్తగా 20 వరకు పెరగనున్నాయి.

బీసీల గణన కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ వచ్చే నెలలో నివేదిక ఇవ్వనుంది. దీని ఆధారంగా వార్డులు, డివిజన్ స్థానాలకు ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేయనుంది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకూడదన్న సుప్రీం కోర్టు ఆదేశాల నేపథ్యంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. వార్డులు, డివిజన్ల వారీగా ఓటర్ల జాబితాల తుది ప్రచురణ, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలు నెలాఖరులోగా కొలిక్కి రానున్నాయి. ఓటర్ల జాబితాల 2026 మార్చి 9న ప్రచురించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం పురపాలకశాఖను ఆదేశిస్తూ ఫిబ్రవరి 6న నోటిఫికేషన్ ఇచ్చింది. కొంత సమయం కావాలన్న ఆ శాఖ విజ్ఞప్తిని రాష్ట్ర ఎన్నికల సంఘం అనుమతించింది. ఓటర్ల జాబితాల ప్రచురణకు మరోసారి ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంది. రాష్ట్రంలో 87 పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో ప్రస్తుత వార్డుల సంఖ్య 2,445 కాగా పునర్విభజన తరువాత వార్డుల సంఖ్య 3020కి చేరనుంది. మొత్తం 575 వార్డులు పెరగనున్నాయి. 13 నగరపాలక సంస్థల్లో ప్రస్తుతం 172 డివిజన్లు ఉండగా పునర్విభజన తర్వాత వాటి సంఖ్య 922 కానుంది. రాష్ట్రంలో 23 పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీలకు సంబంధించి కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నందున వాటికి ప్రస్తుతానికి ఎన్నికలు నిర్వహించకపోవచ్చని తెలుస్తోంది. చుట్టూ పంచాయతీలు, గ్రామాలను పుర, నగరపాలక సంస్థల్లో గత పుర ఎన్నికల ముందు విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ పలువురు కోర్టుల్లో కేసులు వేశారు. ఇవి పరిష్కారమయ్యాక వీటిలో ఎన్నికల నిర్వహణకు ప్రత్యేకంగా నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉంది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా ఎవర్ని నియమిస్తారన్న దానిపైనా ఆసక్తి నెలకుంది. త్వరలో ఉద్యోగ విరమణ చేయనున్న ఒక ఐఏఎస్ పేరు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. నెలాఖరులోగా కొత్త కమిషనర్‌ను నియమించే అవకాశాలున్నాయి.

## ఏపీలోనూ యాపిల్ పంట



**అమరావతి, పతాకం న్యూస్:** చల్లని, మంచు ప్రదేశాల్లో పండే యాపిల్ పంట ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌కూ విస్తరించింది. ఉద్యాన పంటలకు నిలయంగా మారిన రాయలసీమలో యాపిల్ సాగు ప్రారంభమైంది. అనంతపురం జిల్లా గార్లదిన్నె, కుందుర్పి, పెద్దపప్పూరు మండలాల్లో ముగ్గురు రైతులు యాపిల్ సాగు చేపట్టారు. 15 ఎకరాల్లో తోటలు వేశారు. స్థానిక పరిస్థితుల్లో బాగా దిగుబడినిచ్చే కాశ్మీర్ లోచిల్లీ డెలిషియస్ (కేఎల్‌డీ) రకాన్ని రైతులు పండిస్తున్నారు. గార్లదిన్నె మండలం కోటంకా గ్రామానికి చెందిన రైతు రమణారెడ్డి రెండున్నర ఎకరాల్లో ఆపిల్ వేశారు. 2024 జూలైలో 1,500 మొక్కలు నాటారు. ఒక్కో మొక్క ఖరీదు రూ.280. మొక్కలకు పశువుల కంపోస్ట్‌తోపాటు యూరియా, పొటాష్, ఫాస్ఫేట్, ఇతర కాంప్లెక్స్ ఎరువులు వాడుతున్నారు. తెగుళ్లు, కీటకాలు ఆశించకుండా కాయలకు కవర్లు తొడుగుతున్నారు. డిసెంబరులో పూతకు వచ్చిన చెట్లు.. ఇప్పుడు కాయలు కాసి, కోతకొచ్చాయి. మొదటి పంట కాస్త తక్కువగా ఉన్నా.. ఎకరానికి సుమారు టన్ను దిగుబడి వచ్చిందని చెప్తున్నారు. మధ్యస్థ పరిమాణంలో ఉండే ఈ యాపిల్ పండ్లు కాశ్మీర్ ఆపిల్ కన్నా తియ్యగా, రుచిగా ఉన్నాయని రైతులు తెలిపారు. మార్కెట్‌లో నాణ్యమైన ఈ పండ్లకు కిలోకి రూ.170, మధ్యస్థ నాణ్యతకి రూ.120 దాకా పలుకుతోంది. దానిమ్మ మాదిరిగానే రెండో ఏడాది నుంచి కోత ప్రారంభమౌతుంది. ఎక్కడో కాశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్‌లో పండే యాపిల్ ఇప్పుడు ఏపీలోనూ ఉత్పత్తి చేసే పరిస్థితి వచ్చింది. సరైన యాజమాన్యంతో రానున్న రోజుల్లో సీమలో ఆపిల్ దిగుబడి మెరుగుపడుతుందని ఉద్యానశాఖ డైరెక్టర్ శ్రీనివాసులు చెప్పారు. అనంతపురం జిల్లాలో మొదటి సారి సాగైన 'అనంత యాపిల్స్'ను.. పండ్ల గిన్నెగా గిఫ్ట్ ప్యాక్లుగా చేసి విక్రయిస్తున్నారు. మంచి రుచిగా ఉండటంతో స్థానికంగా మంచి డిమాండ్ వచ్చింది. ఇటీవల అనంతపురంలో జలధార కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు ఒక స్టాల్‌లో ఏర్పాటు చేసిన 'అనంత యాపిల్' గిఫ్ట్ ప్యాక్‌ను పరిశీలించి, ఏపీలోనూ యాపిల్ సాగు చేపట్టడాన్ని ప్రశంసించారు. అధిక ఉష్ణోగ్రతలు ఉండే అనంతపురం జిల్లా వాతావరణ పరిస్థితుల్లోనూ హాట్ జోన్ యా పిల్ ఉత్పత్తిపై పరిశీలన కోసం ఉద్యాన శాఖ శాస్త్రవేత్తల బృందాన్ని ఏర్పాటు చేసింది. అనంత యాపిల్‌పై అధ్యయ నం చేసి, రానున్న రోజుల్లో రాయలసీమతోపాటు ఏజెన్సీ ప్రాంతాల్లోనూ యాపిల్ సాగును ప్రోత్సహించాలని భావిస్తున్నట్లు ఉద్యాన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు.

## స్వచ్ఛ నిడదవోలు లక్ష్యం: మంత్రి దుర్గేష్



**నిడదవోలు, పతాకం న్యూస్:** 'స్వచ్ఛాంధ్ర– స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 18న సిఎం చంద్రబాబు నిడదవోలు పర్యటనకు రానున్నారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఉన్నతాధికారులతో మంత్రి దుర్గేష్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. మాలకోడూరు చెరువు, చినకాశిరేవు, లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రాంగణం, మహిళా కళాశాల ప్రాంగణం, కరెంట్ ఆఫీస్ స్థలం, పంగిడి రోడ్డులోని బ్రాహ్మణగూడెం ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం పర్యటించిన ప్రాంతాల్లో సంబంధిత ఏర్పాట్లపై మంత్రి అధికారులతో సమీక్షించారు. పర్యటన నిమిత్తం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు పట్టణంలోని లయన్స్ హాస్పిటల్ సమీపంలోని మాలకోడూరు చెరువును, చినకాశిరేవు, ప్రజావేదిక కోసం ప్రస్తుతం ప్రెస్ మీట్ జరిగిన ప్రాంతం, కార్యకర్తల సమావేశం కోసం లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రాంగణం, హెలిప్యాడ్ కోసం పంగిడి రోడ్డులోని బ్రాహ్మణగూడెం ప్రాంతాలను పరిశీలించామన్నారు. అక్కడి నుంచి సిఎం సభావేదికకు వచ్చి తిరిగి వెళ్లేలా రూట్ మ్యాప్ రూపొందించామన్నారు. ఈ ప్రాంతాల ఎంపికపై సమగ్రంగా అధ్యయనం చేస్తున్నామన్నారు. ఈ విషయంపై సిఎంఒతో చర్చించి వారి అభిప్రాయాలు తీసుకొని ముందుకు వెళ్తామన్నారు. పూర్తిస్థాయి చర్చలు జరిగాక కార్యక్రమం షెడ్యూల్ రూపొందిస్తామన్నారు. మే 1న ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు పంపిణీ చేసే కార్యక్రమానికి రావాల్సిందిగా సిఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశానని, తుది నిర్ణయం వచ్చాక ఆ వివరాలు వెల్లడిస్తానని తెలిపారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. పట్టణ సుందరీకరణలో భాగంగా రూ.5.5 కోట్లతో అభివృద్ధి చేయనున్న మాలకోడూరు చెరువును, చినకాశీరేవును పరిశీలించామని, వర్షపు నీరు ఇళ్లలోకి రాకుండా నీటి నిల్వ సామర్థ్యం పెంచడం, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. చారిత్రాత్మక నిడదవోలు పట్టణానికి సిఎం వస్తుండడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించేందుకు కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు క్రమశిక్షణతో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వై.మేఘా స్వరూప్, మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ ఎ.దుర్గేష్, కమిషనర్ కృష్ణవేణి పాల్గొన్నారు.

## మత సామరస్యాన్ని కాపాడుదాం

**అదోని, పతాకం న్యూస్:** సాటి మనిషి పట్ల సోదర భావం కలిగి మత సామరస్యాన్ని కాపాడే దిశగా ప్రతి ఒక్కరు వ్యవహరించాలని తెలిపారు. సోమవారం ఆదోని పట్టణంలోని ఎస్‌కేఎస్ ఫంక్షన్ హాల్‌లో హజ్ యాత్రికులను పూలమాల శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఉమాపతి నాయుడు మాట్లాడారు ముస్లిం మైనార్టీల సంక్షేమం సీఎం చంద్రబాబు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అంతకుముందు తెలుగుదేశం పార్టీ నాయకులు డి. ఆరిఫ్ బాషా ఆహ్వానం మేరకు, హజ్ యాత్రకు వెళ్తున్న హాజీలకు విందు లో పాల్గొన్నారు ఏర్పాటు హజ్ కు వెళ్లేవారు క్షేమంగా యాత్ర పూర్తిచేసి తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఆదోని నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి, ప్రజల సుఖసంతోషాల కోసం దువా చేయాలని కోరారు. అదేవిధంగా యాత్రికులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు అల్తాఫ్ హుస్సేన్, జాఫర్ సాధిక్, అసిఫ్ బాషా, మన్సూర్ వున్నారు.

## ఏపీలో ఠారెత్తిస్తున్న ఎండలు, వడగాడ్పులు.. ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు

**అమరావతి, పతాకం న్యూస్:** వేసవి కాలం మొదలు కావడంతో రాష్ట్రంలో రోజురోజుకీ ఎండలు, వడగాడ్పులు ఠారెత్తిస్తున్నాయి. ఉదయం 10 గంటలు దాటిందంటే ప్రజల ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు భయపడతున్నారు. కాగా ఈ రోజు కడప జిల్లాలోని పొట్టిపాడులో అత్యధికంగా 43.8 డిగ్రీలు, తిరుపతి జిల్లా వరదయ్యపాలెంలో 43.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్ర 51 మండలాల్లో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు హెచ్చరించారు. మరో 49 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని తెలిపారు. ఎండ తీవ్రత, వడగాల్పులు, ఉక్కపోత పట్ల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉత్తరాంధ్రలో వడగాల్పులు, కోస్తా, రాయలసీమ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో 9, విజయనగరం 18, పార్వతీపురం మన్యం 15, అల్లూరి 1, పోలవరం 3, అనకాపల్లి 3, ఏలూరు జిల్లాల్లోని 2 మండలాల్లో తీవ్రవడగాల్పులు వీచే అవకాశం ఉందని తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో 2 మండలాలు, విజయనగరం 5, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 4, పోలవరం 9, అనకాపల్లి 5, కాకినాడ 5, తూర్పుగోదావరి 9, ఏలూరు 4, ఎన్టీఆర్ జిల్లాలో 3, పల్నాడు 2, నంద్యాల జిల్లాల్లో 1 మండలాల్లో వడగాల్పులు ప్రభావం చూపనున్నట్లు తెలిపారు. వడగాడ్పుల తరుణంలో ఎండలో బయటకు వెళ్లేప్పుడు తలకి టోపి పెట్టుకోవాలని, తెలుపురంగు కాటన్ వస్త్రాలను ధరించాలని అధికారులు సూచించారు. కళ్ల రక్షణ కోసం సన్ గ్లాసెస్ ఉపయోగించాలని, చెవుల్లోకి వేడిగాలి వెళ్లకుండా జాగ్రత్త పడాలని, గుండె సంబంధిత వ్యాధులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగరాదని సూచించారు. నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు, మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. 200 మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కడప జిల్లాలోని పొట్టిపాడులో అత్యధికంగా 44.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పగటిపూట ప్రయాణించేవారు టోపీలు, మాస్కులు, మహిళలైతే ముఖానికి వస్త్రాలు రక్షణగా




ధరిస్తున్నారు. ఇక విద్యార్థులు, ఉద్యోగులు, కూలీలు ఎండలోనే ప్రయాణిస్తున్నారు. కొందరు వేసవి నుంచి ఉపశమనం కోసం చలివేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. కొందరు కొబ్బరి బోండాలు, శీతల పానీయాల బళ్ల వద్దకు చేరుతున్నారు. భూతాపంతో ఎండలు ఎక్కువగా ఉండే విజయవాడ వంటి ప్రాంతంలో అధిక ఉష్ణోగ్రతలు నగర వాసుల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఎండలు, వడగాడ్పుల వల్ల వడదెబ్బలు తగిలే ప్రమాదం లేకపోలేదు. రాష్ట్రంలో 2023లో 833, 2024లో 4,444, 2025లో 5,154 చొప్పున వడదెబ్బ కేసులు నమోదయ్యాయి. 2025లో అత్యధికంగా ఏలూరు జిల్లాలో 1,284, కృష్ణా జిల్లాలో 1,214, విశాఖలో 1,089, కడపలో 325, పల్నాడు జిల్లాలో 268 చొప్పున వడదెబ్బ కేసుల నమోదయ్యాయి.

## జనాభా ఆధారంగా లోక్ సభ సీట్లను పెంచాలని బీజేపీ చూస్తోంది: రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, పతాకం న్యూస్:** జనాభా ఆధారంగా లోక్ సభ సీట్లను పెంచాలని బీజేపీ చూస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ప్రధాని మోదీని ఉద్దేశిస్తూ ఆయన ట్వీట్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చే మహిళా బిల్లుకు ప్రతి ఒక్కరు మద్దతిస్తారని ఆయన పేర్కొన్నారు. కానీ లోక్ సభ సీట్ల పెంపు విషయంలోనే భిన్నాభిప్రాయాలు ఉన్నాయని తెలిపారు.లోక్ సభ సీట్ల పెంపు విషయంపై అఖిల పక్ష భేటీలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని అన్నారు. లోక్ సభ సీట్ల పెంపు, మహిళా రిజర్వేన్లు వేర్వేరనేది ప్రతి పౌరుడికి తెలుసని అన్నారు. అసెంబ్లీ సీట్లలో మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే దేశం మొత్తం ఆమోదిస్తుందని అన్నారు. మహిళా రిజర్వేషన్ల పేరుతో జనాభా ఆధారంగా లోక్ సభ సీట్లు పెంచాలని బీజేపీ చూస్తోందని ఆరోపించారు. దక్షిణాది, చిన్న రాష్ట్రాలకు ఈ విధానం అన్యాయం చేస్తోందని రేవంత్ రెడ్డి అన్నారు. భవిష్యత్తులో దేశాన్ని బలహీనం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏ పార్టీకైనా జాతీయ ప్రయోజనాలే ముఖ్యంగా ఉండాలని అన్నారు. లోక్ సభ నియోజకవర్గాల పునర్విభజన కోసం దామాషా పద్ధతి కాకుండా మరో విధానాన్ని అనుసరించాలని కోరారు. అన్ని పార్టీల ఏకాభిప్రాయంతో ఈ అంశంపై ముందుకు వెళ్లాలని సూచించారు.

## కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



**మంగళగిరి, పతాకం న్యూస్:** మొక్కజొన్న, జొన్న, పెసర, మినుము, సెనగ తదితర పంటల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరలకు కొనుగోలు చేయాలని కోరుతూ సోమవారం రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళగిరి డిప్యూటీ తాసిల్దార్ కు వినతిపత్రం అందజేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా పంటలకు మద్దతు ధర ప్రకటించి మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తామని ప్రకటించడం జరిగిందని విన్నవించారు. ఎక్కడ మొక్కజొన్న తదితర పంటలకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని తెలిపారు. మరోవైపు కేంద్ర మద్దతు ధర లేని తిథి ఉందని విన్నవించారు. ఈ నేపథ్యంలో మొక్కజొన్నకు మద్దతు ధర 2400 రూపాయలు ఉండగా ప్రైవేట్ వ్యాపారులకు 1600 రూపాయల నుండి 1700 రూపాయలకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. కౌలు రైతులు, రైతులు, అధిక వడ్డీలకు అప్పుచేసి అనేక ఇబ్బందులు పడి పంటలు పండించి అప్పుల పాలు అవుతున్నారని విన్నవించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పంటలకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు కొనుగోలు చేయాలని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని విన్నవించారు. సిఐటియు సీనియర్ నాయకులు జె వి రాఘవులు, రైతు సంఘం మంగళగిరి మండల కార్యదర్శి వల్లూరి భారతి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకురాలు బి కోటేశ్వరి, సిఐటియు పట్టణ కన్వీనర్ ఎం బాలాజీ, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ళ కోసం దద్దరిల్లిన విజయవాడ కలెక్టరేట్



**విజయవాడ, పతాకం న్యూస్:** రెండు సెంట్ల ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్ళు ,టిడ్కో గృహాలు, ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్, పెన్షన్లు సంక్షేమ పథకాల అమలు కోరుతూ సిఐటియు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విజయవాడలో కలెక్టరేట్ వద్ద మహాధర్నాను చేపట్టారు. ఈ ధర్నాకు వందలాది మంది దరఖాస్తులతో తరలివచ్చారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్. బాబురావు ఈ ధర్నాలో పాల్గొని మద్దతు పలికారు. అనంతరం సిఐటియు నేత డి. కాశీనాథ్, ఐద్వా నేత కే. శ్రీదేవి, బి సత్యబాబు తదితరులు ప్రసంగించారు. దరఖాస్తులతో తరలివచ్చిన జనంతో కలెక్టరేట్ పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. హామీల అమలులో ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ ప్రజలు నినాదాలు చేశారు. ప్లే కార్డులు, బ్యానర్లు ప్రదర్శించి ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మైనర్లకు బైక్‌లు ఇస్తే చర్యలు



**అనంతపురం, పతాకం న్యూస్:** పుట్లూరు మండల కేంద్రంతో పాటు గ్రామాలలో కూడా ఇటీవల కాలంలో రోడ్లపైన మైనర్ బైక్ రైడర్లు అధికమయ్యారు. ఇక కొద్ది రోజుల్లో వేసవి సెలవులు కూడా ప్రారంభం కానున్నాయి. దీనితో మైనర్ బైక్ రైడర్లు అధికమయ్యే అవకాశం ఉంది. పిల్లలకు పాఠశాలలు లేకపోవడంతో వయసుకు మించిన వాహనాలను నడుపుతూ రోడ్లపై ప్రమాదకరంగా తిరుగుతూ రోడ్డులో కొందరు ఆకతాయిలు అతివేగంగా ద్విచక్ర వాహనాలు నడుపుతూ స్థానిక ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఇటువంటి ఆకతాయిలు అతి వేగంగా రోడ్లలో వెళ్లే సమయంలో ఎవరైనా మైనర్లు బైక్ నడుపుతూ ఉంటే అటువంటి వారిని గుద్దుతే తీవ్ర స్థాయిలో ప్రమాదం జరిగే అవకాశం ఉందని, తల్లిదండ్రుల అతి ప్రేమ చిన్నారుల ప్రాణమిదికే తెస్తుందని తెలిపారు. చిన్నారులకు వాహనాలు ఇచ్చే ముందు ప్రతి తల్లిదండ్రులు ఆలోచించాలని, పిల్లలకు భారీ వాహనాలు ఇచ్చేముందు తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సోమవారం ఎస్ఐ సురేంద్ర బాబు హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మైనర్ బైక్ రైడర్లు దొరికితే అపరాధ రుసుంతోపాటు తల్లిదండ్రులు శిక్షారులవుతారని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని మండల కేంద్రంతోపాటు గ్రామాలలో కూడా మైనర్ బైక్ రైడర్ లపై ప్రత్యేక నిఘ ఉంచడం జరిగిందని ఎస్సై తెలిపారు.

## శ్రీశైలంలో చిరుతపులి సంచారం..



**శ్రీశైలం, పతాకం న్యూస్:** శ్రీశైలం శిఖరేశ్వరం సమీపంలో చిరుతపులి సంచారం కలకలం రేపుతోంది. ఆదివారం రాత్రి ఘాట్ రోడ్డులో భక్తులు వెళ్తుండగా చిరుతపులి తారసపడింది. దీంతో వారంతా తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. దోర్నాల వైపు వెళ్తున్న ప్రయాణికులకూ చిరుత కనిపించింది. రాత్రి సమయంలో వారంతా రోడ్డు పక్కన కూర్చుని ఉండగా చిరుతను గుర్తించారు. కాసేపు భయాందోళనలకు గురైనా అనంతరం తేరుకుని చిరుతను తమ సెల్ ఫోన్లలో చిత్రీకరించారు. ఆ వీడియోను కాస్తా సోషల్ మీడియాలో పోస్టు చేశారు. శ్రీశైలం ఘాట్ రోడ్డులో ప్రయాణించే భక్తులు అప్రమత్తంగా ఉండాలని ఓ భక్తుడు సూచించాడు. మరోవైపు అటవీశాఖ అధికారులు సైతం రంగంలోకి దిగారు. చిరుత నుంచి భక్తులను కాపాడేందుకు చర్యలు చేపట్టారు.

## వివోఏల సమస్యలు పరిష్కరించాలి

**నంద్యాల, పతాకం న్యూస్:** వివోఏలకు మూడు నెలల వేతన బకాయిలు కనీస వేతనాలు చెల్లించాలని హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని, శ్రీనిధి బకాయల చెల్లింపు సెల్ ఫోన్స్ గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని అభయహస్తం మహిళా మార్ట్ లో పెట్టిన పెట్టుబడులు పొదుపు మహిళలకు తిరిగి చెల్లించాలని వడ్డీ రాయితీ ఇవ్వాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి వివోఏల సంఘం నాయకులు పుల్లం రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి టి గోపాలకృష్ణ మాట్లాడుతూ వెలుగు వివోఏలకు కనీస వేతనాలు చెల్లించాలని అన్నారు రాష్ట్రంలో 28,000 మంది వీవోఏలు పొదుపు సంఘాలు మహిళలకు దీర్ఘకాలంగా సేవలందిస్తున్నారు. కనీస వేతనం ఉద్యోగ భద్రత కోసం మొబైల్ సిమ్ కార్డ్స్ గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం తదితర డిమాండ్ల సాధనకై ఆందోళనలు పోరాటాలు నిర్వహించాలన్నారు. వేతనాలు పెరిగి ఏడు సంవత్సరాలయింది పెరుగుతున్న ధరలకు అనుకూలంగా వేతనాలు పెంచాలన్నారు. తక్షణమే వివో ఏ లకు మూడు నెలల వేతన బకాయిలు కనీస వేతనాలు చెల్లించాలన్నారు. లేని పక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తాసిల్దారు శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు.

## ఎస్సీ, ఎస్టీలకు ఉచిత సోలార్ విద్యుత్ పథకం



**కడియం, పతాకం న్యూస్:** ఎస్సి, ఎస్టిలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా సోలార్ విద్యుత్ పథకాన్ని అమలు చేస్తుందని ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు.మండలంలోని కడియపుసావరం గ్రామంలో సూర్యఘర్ పథకాన్ని ఎంఎల్ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సి, ఎస్టి సామాజికవర్గాలకు విద్యుత్ భారం తగ్గించేలా లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకం ద్వారా సౌరశక్తి వినియోగం పెరుగుతుందని, పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడుతుందన్నారు. భవిష్యత్తులో ప్రతి ఇంటి మీద సౌర ప్యానెల్స్ ఏర్పాటు చేసేలా మండలాన్ని తీర్చిదిద్దుతామన్నారు. ప్రజలందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని, ప్రభుత్వంతో కలిసి ముందుకు రావాలన్నారు. ఎపిఇపిడిసిఎల్ ఇఇ నటరాజన్ మాట్లాడుతూ ఎస్సి, ఎస్టి కుటుంబాలకు పిఎం సూర్యఘర్ పథకం కింద ఉచితంగా 2 కిలోవాట్ల రూఫ్‌టాప్ సోలార్ ప్యానెల్స్ అమర్చుతారని, అలాగే 5 సంవత్సరాలు నిర్వహణ ఉంటుందన్నారు. సొంత ఇల్లు ఉండాలన్నారు. నెలకు 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడేవారు అర్హులని తెలిపారు. అదనపు విద్యుత్‌ను గ్రిడ్‌కు పంపడం ద్వారా ఆదాయం పొందవచ్చున్నారు. అలాగే ప్రతి సోలార్ లబ్ధిదారుడికి నెలకు రూ.200 అద్దెను ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. కడియం మండలంలో 1037 మంది ఎస్సి, ఎస్టి లబ్దిదారులను గుర్తించగా, ఇప్పటి వరకూ 158 మంది ఇళ్ల వద్ద సోలార్ రూఫ్ టాప్ ప్యానెల్స్ అమర్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చెక్కపల్లి మురళీకృష్ణ, మండల టిడిపి అధ్యక్షులు వెలుగుబంటి నాని, ఎంపిటిసి నాగిరెడ్డి రామకృష్ణ, విద్యుత్ ఎడిఇ పి.సన్యాసిరావు, ఎఇలు సత్యప్రసాద్, రామారెడ్డి, ఎంపిడిఓ రమేష్, తదితర నాయకులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## కెసిఆర్‌కు సీతక్క లీగల్ నోటీసు

**హైదరాబాద్, పతాకం న్యూస్:** బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌కు మంత్రి సీతక్క లీగల్ నోటీసు జారీ చేశారు. అంగన్వాడీ మొబైల్ ఫోన్ల కొనుగోలు అంశంపై బిఆర్ఎస్ సోషల్ మీడియాలో నిరాధార ఆరోపణలు చేసిందని, తన ప్రతిష్ఠను దెబ్బతీసిందని సీతక్క నోటీసులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంతో తనకు సంబంధం లేదని, ఈ దుష్ప్రచారానికి కెసిఆర్‌దే బాధ్యత అని స్పష్టం చేశారు. 48 గంటల్లో ఆ పోస్టులను తొలగించి కెసిఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

# 'బ్యాక్ పెయిన్' మీకు వెన్నులో నొప్పిగా ఉందా?

మనం ఏ పని చేయాలన్నా, అందుకు మన వెన్నెముక సహకరించాలి. నిలబడాలన్నా, కూర్చోవాలన్నా, బరువులు ఎత్తాలన్నా ఇలా ఏ పని చేయాలన్నా మన వెన్నెముక దృఢంగా ఉండాలి. కానీ, మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు మూలంగా ఇవాళ మన వెన్నెముకపై ఒత్తిడి పెరిగి, రోజురోజుకూ బలహీనంగా మారుతోంది. ఈ క్రమంలో చాలామంది వెన్నెముక డిస్కు జారిందని, నడుం నొప్పితో బాధపడుతున్నామని చెబుతుంటారు. ఇంతకీ డిస్కు అంటే ఏమిటి? ఇదెందుకు జారుతుందో ఇప్పుడు తెలసుకుందాం! వెన్నెముక పూసల మధ్య మందంగా, దృఢంగా రబ్బరులాంటి భాగాలుంటాయి. వీటినే డిస్కులు అంటారు. వంగటం, పక్కలకు తిరగటం వంటివి చేసినప్పుడు వెన్నుపూసలు మృదువుగా కదలటానికి తోడ్పడుతా యంటున్నారు నిపుణులు. వీటి మధ్య భాగంలో చిక్కటి ద్రవం, చుట్టూ గట్టి పీచులాంటి పదార్థం ఉంటాయని చెబుతున్నారు. ఇవి క్షీణించినా, దెబ్బతిన్నా వెలుపలి భాగం బలహీనమై చిట్లిపోవచ్చని హెచ్చరిస్తున్నారు. దీంతో లోపలున్న పదార్థాలు తోసుకురావొచ్చు, లీక్ కావొచ్చని, దీన్నే డిస్కు జారటం, ఉబ్బటం, చిట్లటం, ముందుకు పొడుచురావటం అంటున్నారు. ఇది వెన్ను మధ్యలో ఉండే నాడులను నొక్కటం వల్ల నడుం నొప్పి తలెత్తుతుందని, కాళ్లలోకి నొప్పి పాకు తున్నట్టుగానూ (సయాటికా) అనిపించొచ్చని తెలియజేస్తున్నారు. ఏ నాడి ప్రభావితమైందనే దాన్ని బట్టి మొద్దుబారటం, పొడుస్తున్నట్లు అనిపించటం, కండరం బలహీనం కావటం వంటివీ ఉంటాయని పేర్కొంటున్నారు. కొందరికి నొప్పి స్వల్పంగానే ఉంటే, మరికొందరికీ చాలా తీవ్రంగా వేధించొచ్చని వెల్లడిస్తున్నారు. అరుదైన సందర్భాల్లో, ఇది పక్షవాతం, కాళ్ళలో జలదరింపు లేదా మూత్రాశయం లేదా ప్రేగు సమస్యలను కూడా కలిగిస్తుందని అధ్యయనం పేర్కొంది. క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం,



బరువులు సక్రమంగా ఎత్తటం, ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాట్లతో డిస్కు జారిపోకుండా చూసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. నడక, ఈత, పరుగు వంటి వ్యాయామాల వల్ల వెన్నెముక మృదువుగా కదలటానికి, బలంగా ఉండటానికి తోడ్పడతాయంటున్నారు. అడ్డదిడ్డంగా బరువులు ఎత్తొద్దని తెలియజేస్తున్నారు. అదిరినట్టుగా పక్కలకు తిరగొద్దని పేర్కొంటున్నారు. ఎలాపడితే అలా జారగిల్లొద్దని, ఏ పనిచేస్తున్నా శరీర భంగిమ సరిగా ఉంచుకోవటానికి ప్రయత్నించాలని వివరిస్తున్నారు.

ఎక్కువసేపు కూర్చొని పనులు చేసేవారు మధ్యమధ్యలో కుర్చీలోంచి లేచి, కాసేపు అటూ, ఇటూ నడవాలని నిపుణులు చెబుతున్నారు. బరువు అదుపులో ఉంచుకుంటే డిస్కుల మీద భారం పడకుండా చూసుకోవచ్చని అంటున్నారు. సిగరెట్లు అలవాటుంటే మానెయ్యాలని సూచిస్తున్నారు. ఎందుకంటే పొగలోని నికొటిన్ డిస్కు కణజాలాన్ని బలహీనం చేస్తుందని చెబుతున్నారు. చురుగ్గా ఉండటం, నొప్పి నివారణ మందులు తీసుకోవడం వల్ల జారిన డిస్క్ వల్ల కలిగే నొప్పి తగ్గుతుందని అధ్యయనం పేర్కొంది. డిస్కు జారిందనగానే సర్జరీ తప్పదని చాలామంది అపోహ పడుతుంటారు. కానీ, ఇది నిజం కాదంటున్నారు నిపుణులు. 90 శాతం మందికి తగినంత విశ్రాంతి, మందులు, ఫిజియోథెరపీ వ్యాయామాలతోనే మంచి ఫలితం కనిపిస్తుందని చెబుతున్నారు. ఈ క్రమంలో నొప్పి ఉన్నప్పుడు కొద్దిరోజులు విశ్రాంతి తీసుకోవటం మంచిదని తెలియజేస్తున్నారు. వేడి కాపు, ఐస్ అద్దటం, నెమ్మదిగా సాగదీయటం ఉపయోగపడతాయని వివరిస్తున్నారు. ఇలాంటి సమయంలో పూర్తిగా మంచానికే అతుక్కుపోవాల్సిన పనిలేదని, నడుం మీద ఎక్కువ భారం పడకుండా తేలికపాటి వ్యాయా మాలు, నడక, ఈత వంటివి చేయాలని సలహా ఇస్తున్నారు. అలాగే, డాక్టర్ల సలహా మేరకు నొప్పిని తగ్గించే మందులు వేసుకోవాలని సూచిస్తున్నారు. అంతేకాకుండా, శరీర భంగిమ సరిగా ఉండేలా చూసుకోవటం, వెన్నుకు దన్నుగా ఉండే కుర్చీలు వాడుకోవటం వంటివి నొప్పి నుంచి త్వరగా కోలుకోవటానికి తోడ్పడతాయని పేర్కొంటున్నారు. నడుస్తున్నప్పుడు, కూర్చున్నప్పుడు, నిలబడినప్పుడు, నిద్రపోతున్నప్పుడు శరీర భంగిమను ఎలా మెరుగు పరచుకోవాలో తెలుసుకోవాలని, మంచి భంగిమ వెన్నెముకపై ఒత్తిడిని తగ్గిస్తుందని అధ్యయనం పేర్కొంది.

రెండు, మూడు వారాలు దాటినా నొప్పి తగ్గకపోతే, నొప్పి మాత్రలతో ఉపశమనం కలగకపోతే, రోజువారీ పనులు చేసుకోలేనంతగా నొప్పి వేధిస్తుంటే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలంటున్నారు నిపుణులు. ఈ నేపథ్యంలో బలహీనత ఎక్కువ కావటం, సరిగి నడవలేకపోవటం వంటి తీవ్ర లక్షణాలు కనిపిస్తే అసలే నిర్లక్ష్యం చేయొద్దని, త్వరగా చికిత్స తీసుకుంటే దీర్ఘకాల దుష్ప్రభావాలను తప్పించుకోవచ్చని తెలియజేస్తున్నారు.

# పెరుగుతున్న డిజిటల్ నేరాలు

## 28 లక్షలకు చేరిన కేసుల సంఖ్య.. రూ. 23 వేల కోట్ల నష్టం



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఆన్‌లైన్ చెల్లింపులపై ఎంతగా ప్రచారం జరుగుతోందో అంతే స్థాయిలో డిజిటల్ నేరాలు కూడా పెరిగిపోతున్నాయి. వీటిని అడ్డుకునేందుకు రిజర్వ్ బ్యాంక్ కు ఎన్ని ప్రత్యామ్నాయాలు ఆలోచిస్తున్నా కూడా నేరస్తులు అంతకు మించిన స్థాయిలో తెలివితేటలు వాడుతున్నారు. ఏటా ఈ నేరాలు పెరుగుతున్న తీరుపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. తాజాగా రిజర్వ్ బ్యాంకు వెల్లడించిన నివేదిక మేరకు దేశ వ్యాప్తంగా ఏకంగా 28 లక్షలకుపైగా కేసులు నమోదుకాగా, వీటి విలువ రు.23 వేల కోట్లకు చేరింది. అందుకే మరోసారి ఈ అంశం చర్చకు తెరతీయడంతో మరిన్ని నివారణ చర్యలు తీసుకోవాలని భావిస్తున్న ఆర్బిఐ రాష్ట్రాలు, ఆర్థిక సంస్థల అభిప్రాయాలను తీసుకోవాలని నిర్ణయించింది. గత ఐదేళ్ల కాలంలో డిజిటల్ నేరాలు భారీగా పెరిగిపోతున్నాయి. 2021లో 2.6 లక్షల కేసులు నమోదుకాగా, 2025 వచ్చేసరికి ఈ కేసుల సంఖ్య 28 లక్షలకు చేరుకుంది. అలాగే 2021లో 551 కోట్ల రూపాయల విలువైన నేరాలు రికార్డు కాగా, 2025 నాటికి నేరాల విలువ రు. 22,931 కోట్లకు చేరిపోవడం ఆందోళన కలిగిస్తోంది. నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా ఈ వివరాలు సేకరించిన రిజర్వ్ బ్యాంక్ తాజాగా కొత్త చర్యలపై దృష్టి సారిస్తోంది.

చిన్న మొత్తాలు కాకుండా ఇతర చెల్లింపులపై స్పష్టమైన విధానాన్ని అమలు చేయాలని ఆర్బిఐ యోచిస్తోంది. చిన్న మధ్య తరగతి ప్రజలు చేసే డిజిటల్ లావాదేవీల్లో నమ్మకస్తుడైన వ్యక్తి జోక్యం ఉండేలా చూడడం, పెద్ద పెద్ద ఖాతాలకు సంబంధించి ఎప్పటికప్పుడు అదనపు సమీక్షలు చేయడం, వినియోగదారులు కూడా తమ లావాదేవీలను స్వయంగా నియంత్రించుకునేలా ప్రోత్సహించడం వంటి అంశాలపై రిజర్వ్ బ్యాంకు దృష్టి సారిస్తోంది.

వివిధ లావాదేవీలకు సంబంధించి విదేశాల్లో అమలు చేస్తున్న విధానాపైనా అధ్యయనం చేయాలని నిర్ణయించారు. ప్రధాన,గా బ్రిటన్లో అమలు చేస్తున్న పేమెంట్ సర్వీసెస్ అమెండ్మెంట్ రెగ్యులేషన్స్ -2024 నిబంధనలు, సింగపూర్లో ఎనేన్స్ యాంటీ స్కామ్ ఫ్రేమ్ వర్క్ విధానం, స్వీడన్లోని అక్కడి బ్యాంకర్ల సంఘం అధ్వర్యంలో నేరాల అదుపునకు తీసుకుంటున్న చర్యలపైనా రిజర్వ్ బ్యాంకు దృష్టి సారిస్తోంది.

డిజిటల్ నేరాలు పెరగడానికి గల కారణాలను కూడా రిజర్వ్ బ్యాంక్ అధ్యయనం చేస్తోంది. నేరాలు చేసే సమయంలో బాధితులు ఆలోచించుకోవడానికి అవకాశం లేనివిధంగా వారిలో ఆతృత సృష్టించడంద్వారా నేరస్తులు లబ్ది పొందుతున్నారని భావిస్తున్నారు. అలాగే వివిధ లావాదేవీల్లో తమ వ్యవస్థ రక్షణాత్మకంగా ఉ ందని వినియోగదారులకు తప్పుడు భరోసా కల్పించడంద్వారా బాధితులను ఆకర్షించడంపైనే నిందితులు దృష్టి సారిస్తున్నట్లు భావిస్తున్నారు. అందుకే వినియోగదారుల్లో అవగాహన కల్పించడం ప్రధాన లక్ష్యంగా కొన్ని అంశాలను తెరపైకి తీసుకువస్తున్న ఆర్బిఐ అభిప్రాయాల సేకరణకు సిద్ధమవుతోంది. అన్ని రంగాల నుంచి వచ్చే నెల ఎనిమిదో తేదీలోగా అభిప్రాయాలను సేకరించాలని నిర్ణయించింది.

# హర్మూజ్ జలసంధిని తక్షణమే దిగ్బంధించాలని అమెరికా నౌకాదళాన్ని ఆదేశించిన ట్రంప్



**న్యూయార్క్:** ఇరాన్-అమెరికా మధ్య పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ లో జరిగిన కీలక చర్చలు విఫలమయ్యాయి. ఈ పరిణామంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, అంతర్జాతీయంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసే సంచలన నిర్ణయం తీసుకున్నారు. వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని తక్షణమే దిగ్బంధించాలని అమెరికా నౌకాదళాన్ని ఆదేశించినట్లు ప్రకటించారు. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ట్రంప్ ఈ హెచ్చరికలు జారీ చేశారు. ఇప్పటికే ఇరాన్ ను చాలా వరకు నాశనం చేశామని... ఆ దేశానికి చెందిన నేవీ, సైన్యం, ఇతర బలగాలు దెబ్బతిన్నాయని, ఇక మిగిలి ఉన్న కొంచెం భాగాన్ని కూడా తమ సైన్యం ముగించేస్తుందని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇటీవల పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మధ్యవర్తిత్వంతో ఇస్లామాబాద్‌లో అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో అమెరికా తరఫున ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్‌కాఫ్, ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్ పాల్గొన్నారు. చర్చల వివరాలను వారు తనకు పూర్తిగా వివరించారని ట్రంప్ తెలిపారు. "చర్చలు బాగానే జరిగాయి, చాలా అంశాలపై ఏకాభిప్రాయం కుదిరింది. కానీ నిజంగా ముఖ్యమైన ఏకైక అంశం, అణు కార్యక్రమంపై మాత్రం ఒప్పందం కుదరలేదు. ఇరాన్ తన అణు ఆకాంక్షలను వదులుకోవడానికి ఇష్టపడటం లేదు! ఆ అంశం చర్చకు వచ్చేసరికి ఇరాన్ మొండికేసింది" అని ట్రంప్ తన పోస్టులో విమర్శించారు. ఇరాన్ తన అణు ఆశయాలను వదులుకోవడానికి సిద్ధంగా లేదని, అస్థిరమైన వ్యక్తుల చేతిలో అణ్వాయుధాలు ఉండటాన్ని అనుమతించలేమని స్పష్టం చేశారు. 'ఇరాన్‌కు అణ్వస్త్రం ఎప్పటికీ దక్కదు' అని ఆయన తేల్చిచెప్పారు. చర్చల వైఫల్యం నేపథ్యంలోనే ట్రంప్ కఠిన నిర్ణయం తీసుకున్నారు. "హర్మూజ్ జలసంధిలోకి ప్రవేశించడానికి లేదా బయటకు వెళ్లడానికి ప్రయత్నించే ఏ నౌకనైనా, అన్ని నౌకలను దిగ్బంధించడం ప్రారంభించాలని నేను మా నౌకాదళాన్ని ఆదేశించాను. త్వరలోనే దిగ్బంధనం ప్రారంభమవుతుంది," అని ఆయన స్పష్టం చేశారు.




# గ్యారీ కిర్‌స్టెన్ కోచింగ్ వల్లే టీమిండియా దశ తిరిగింది: యువీ



టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్, భారత క్రికెట్ జట్టు మాజీ కోచ్ గ్యారీ కిర్‌స్టెన్‌పై ప్రశంసల వర్షం కురిపించాడు. 2008 నుంచి 2011 మధ్య కాలంలో భారత జట్టు సాధించిన విజయాల్లో కిర్‌స్టెన్ కీలక పాత్ర పోషించాడని, అతని కోచింగ్ విధానం జట్టు రూపురేఖలనే మార్చేసిందని యువీ గుర్తుచేసుకున్నాడు. ముఖ్యంగా ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసం నింపి, వారిని నడిపించిన తీరు అద్భుతమని కొనియాడాడు. ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్‌తో 'స్టిక్ టు క్రికెట్' అనే పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ యువరాజ్ ఈ విషయాలను పంచుకున్నాడు. కిర్‌స్టెన్ కోచింగ్‌లో భారత జట్టు ఎదిగిన తీరును వివరిస్తూ... "ఆ సమయంలో గ్యారీ కిర్‌స్టెన్ ప్రభావం చాలా ఉంది. మాకు అప్పుడు కావాల్సింది ఒక మంచి వ్యక్తి. మైదానంలో జట్టుగా మెలగాలని చెప్పే వ్యక్తి అవసరం. గ్యారీ ఆ పాత్రను సంపూర్ణంగా పోషించాడు. అతను చాలా కష్టపడి పనిచేసేవాడు" అని తెలిపాడు. కిర్‌స్టెన్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన మొదటి రోజునే తమతో చెప్పిన మాటలను యువరాజ్ గుర్తుచేసుకున్నాడు. "కోచ్‌గా వచ్చిన తొలిరోజే, రాబోయే నాలుగేళ్లలో టెస్టులు, వన్డేలు, టీ20లు.. ఇలా మూడు ఫార్మాట్లలోనూ మనం నంబర్ వన్ స్థానానికి చేరుకుంటామని గ్యారీ చెప్పాడు. ఆయన మాటలు విని కొందరు ఆటగాళ్లు ఒకరినొకరు చూసుకున్నారు. 'ఏంటి ఈయన చెప్పేది?' అని ఆశ్చర్యపోయారు. కానీ, ఆస్ట్రేలియా ఆధిపత్యం కొనసాగుతున్న రోజుల్లోనే, అతను చెప్పినట్లు నాలుగేళ్లలో మేము ఆ ఘనత సాధించాం. అతని ఉద్దేశం చాలా గొప్పది. భారత క్రికెట్‌ను కిర్‌స్టెన్ మరో స్థాయికి తీసుకెళ్లాడు" అని యువరాజ్ వివరించాడు. కోచ్ ఇచ్చే భరోసా ఆటగాళ్లపై ఎంత ప్రభావం చూపుతుందో యువీ తన సొంత అనుభవంతో చెప్పాడు. "గ్యారీ ఎప్పుడూ నాతో, 'నువ్వొక గేమ్ ఛేంజర్. నా మ్యాచ్ విన్నర్ నువ్వే. నువ్వు ఎన్నిసార్లు విఫలమయ్యావన్నది నాకు అనవసరం. వెళ్లి మన కోసం మ్యాచ్ గెలిపించు' అని చెప్పేవాడు. ఈ మాటలు నా ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చేశాయి. జట్టు, కోచ్ నాపై నమ్మకం ఉంచారని అర్థమైంది.

# రాయల్ చాలెంజర్స్ బెంగళూరు విజయం




మాజీ చాంపియన్ ముంబై ఇండియన్స్ నుంచి మరో నిరాశాజనక ప్రదర్శన. అటు బ్యాటర్ల రాణింపుతో భారీ స్కోరు సాధించిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరుకు బౌలర్ల నుంచి కూడా అద్భుత సహకారం అందింది. దీంతో వాంఖడే మైదానంలో ముంబైపై 18 పరుగులతో నెగ్గింది. ముంబైకిది వరుసగా మూడో ఓటమి. జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బెంగళూరు 20 ఓవర్లలో 4 వికెట్లకు 240 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఫిల్ సాల్ట్ (36 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్సర్లతో 78), కెప్టెన్ రజత్ పటీదార్ (20 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లతో 53), విరాట్ కోహ్లీ (38 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 50), డేవిడ్ (16 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 34 నాటౌట్) వేగంగా ఆడారు. ఛేదనలో ముంబై 20 ఓవర్లలో 222/5 స్కోరుకే పరిమితమై ఓడింది. రూథర్‌ఫోర్డ్ (31 బంతుల్లో 1 ఫోర్, 9 సిక్సర్లతో 71 నాటౌట్), హార్దిక్ (22 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్‌తో 40), రికెల్టన్ (22 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 37) రాణించారు. భారీ ఛేదనలో ముంబై ఏ దశలోనూ విజయం వైపు సాగలేదు. ఆఖర్లో రూథర్‌ఫోర్డ్ ఎదురుదాడికి దిగినా ఫలితం లేకపోయింది. ఆరంభంలో ఓపెనర్లు రికెల్టన్, రోహిత్ (19) బౌండరీలు బాదేస్తూ ఆశలు రేపారు. కానీ ఐదో ఓవర్‌లో రోహిత్ తొడకండరాలు పట్టేయడంతో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. వీరి మధ్య తొలి వికెట్‌కు 57 రన్స్ చేరాయి. అయితే సుయాష్ 8వ ఓవర్‌లో రికెల్టన్, తిలక్ (1) వికెట్లు తీసి దెబ్బ కొట్టాడు. ఈ దశలో హార్దిక్, సూర్య (33) ఆదుకునే ప్రయత్నం చేశారు. కానీ నాలుగో వికెట్‌కు 47 రన్స్ జోడించాక స్వల్ప వ్యవధిలోనే వీరు అవుటయ్యారు. అప్పటికే రన్‌రేట్ పెరగడంతో రూథర్‌ఫోర్డ్ చివర్లో 9 సిక్సర్లతో చెలరేగినా జట్టును గట్టెక్కించలేకపోయాడు.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు ఇన్నింగ్స్‌లో ఓపెనర్లు సాల్ట్, విరాట్‌లతో పాటు రజత్ పటీదార్ అదరగొట్టారు. చివర్లో డేవిడ్ మెరుపులతో జట్టు భారీ స్కోరు సాధించింది. శాంట్నర్ ఓవర్‌లో సాల్ట్ 6,6,6,4తో 22 రన్స్ రాబట్టడంతో పవర్‌ప్లేలో జట్టు 71 రన్స్‌తో నిలిచింది. మార్కండే ఓవర్‌లోనూ 4,4,4,6తో 20 రన్స్ చేసిన సాల్ట్.. 25 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. దీంతో 9వ ఓవర్‌లోనే ఆర్‌సీబీ స్కోరు వంద దాటింది. అయితే ప్రమాదకరంగా మారిన సాల్ట్‌ను శార్దూల్ 11వ ఓవర్‌లో అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 120 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కానీ రజత్ తానెదుర్కొన్న తొలి 4 బంతులను 4,6,6,6గా బాదడంతో స్కోరుబోర్డు ఎక్కడా ఆగలేదు. ఈ ఊపులో అతను 17 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. కాగా, కాస్త నెమ్మదిగా ఆడిన విరాట్ అర్ధసెంచరీ చేసి అదే స్కోరుపై వెనుదిరిగాడు. ఈ జోడీ మధ్య రెండో వికెట్‌కు 65 రన్స్ సమకూరాయి. 16వ ఓవర్‌లో రజత్‌ను శాంట్నర్ అవుట్ చేయగా.. డేవిడ్ బౌండరీలతో జట్టు 240 రన్స్‌కు చేరింది.




# 'పెద్ది' విడుదలపై సందిగ్ధం!



మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా రూపుదిద్దుకుంటున్న స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' సినిమాపై టాలీవుడ్‌లో మొదటి నుంచీ భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రానికి సంబంధించిన టాకీ పార్ట్ తో పాటు దాదాపు మేజర్ షూటింగ్ అంతా పూర్తయింది. చిత్ర యూనిట్ పక్కా ప్రణాళికతో అతి తక్కువ సమయంలోనే చిత్రీకరణను ముగింపు దశకు తీసుకు వచ్చింది. ప్రస్తుతం టీమ్ అంతా పోస్ట్ ప్రొడక్షన్ పనులపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

క్రేజ్‌కు తగ్గట్టుగా, పాన్ ఇండియా స్థాయిలో గ్రాండ్‌గా రిలీజ్ చేయాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా కొత్త రిలీజ్ డేట్‌పై చిత్ర యూనిట్ నుండి అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. ఈ సినివారా నుంచి ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ సోషల్ మీడియాను షేక్ చేసిన సంగతి తెలిసిందే. రామ్ చరణ్ రగ్గడ్ లుక్, బుచ్చిబాబు మేకింగ్ స్టైల్ చూస్తుంటే ఇదొక రా అండ్ రస్టిక్ స్పోర్ట్స్ డ్రామా అని అర్థమవుతోంది. ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తుండటం విశేషం. ఆయన స్వరపరిచిన పాటలు సినిమాకు ప్రధాన బలంగా నిలవనున్నాయి. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన రెండు సాంగ్స్ ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేశాయో ప్రతి ఒక్కరికీ సుపరిచితమే.

రెహమాన్ మార్క్ మెలోడీలు చార్ట్‌బస్టర్స్‌గా నిలిచాయి. ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది, ఇది తెలుగు ప్రేక్షకులలో మరింత ఆసక్తిని పెంచింది. వృద్ధి సినిమాస్ సంస్థ ఎక్కడా రాజీ పడకుండా ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. క్రీడా నేపథ్యంలో సాగే ఈ ఎమోషనల్ డ్రామా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి వండర్స్ క్రియేట్ చేస్తుందో వేచి చూడాలి.

సినిమా షూటింగ్ దాదాపు పూర్తయినప్పటికీ, ఒక ప్రత్యేకమైన ఐటమ్ సాంగ్ విషయంలో మాత్రం ఇంకా స్పష్టత రాలేదని టాక్. ఈ సాంగ్ మినహా మిగిలిన చిత్రీకరణనంతా బుచ్చిబాబు అండ్ టీమ్ విజయవంతంగా పూర్తి చేశారట. ఈ పాట సినిమాకు హైలైట్‌గా నిలుస్తుందని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ సాంగ్‌లో మెగాపవర్ స్టార్ సరసన ఎవరు ఆడిపాడతారు అనే విషయంపై చిత్ర బృందం ఇంకా ఒక కొలిక్కి రాలేదు. లేటెస్ట్ తెలుగు సెన్సేషన్ మానస వారణాసి ఆ పాట చేయనుందనే వార్త వచ్చినప్పటికీ ఇప్పటివరకు మరెలాంటి కొత్త సమాచారం లేదు. ఆ ఒక్క పాట కూడా పూర్తయితే సినిమా గుమ్మడికాయ కొట్టేసినట్టే అని చెప్పవచ్చు.

ముందుగా అనుకున్న ప్రకారం ఏప్రిల్‌లో ఈ చిత్రం విడుదల కావడం లేదనే విషయం ఇప్పటికే స్పష్టమైపోయింది. షూటింగ్ వేగంగా జరిగినప్పటికీ, గ్రాఫిక్స్ మరియు ఇతర సాంకేతిక పనుల దృష్ట్యా మేకర్స్ కొత్త విడుదల తేదీని పరిశీలిస్తున్నారు. రామ్ చరణ్

# సామాన్యురాలి నుంచి సంగీత సామ్రాజ్ఞిగా ఆశా భోంస్లే



భారతీయ సంగీత శిఖరం, పద్మ విభూషణ్, గాన కోకిల ఆశా భోంస్లే (92) ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలిసి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆమె అభిమానులు దిగ్భ్రాంతికి లోనయ్యారు. భారతీయ సంగీత శిఖరం, పద్మ విభూషణ్, గాన కోకిల ఆశా భోంస్లే (92) ఏప్రిల్ 12, ఆదివారం మధ్యాహ్నం ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలిసి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆమె అభిమానులు దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ, ఘనంగా నివాళులు అర్పిస్తున్నారు. భారతీయ సంగీత ప్రపంచంలో ఆశా భోంస్లే (గూంష్ఠు దీష్ట్రశీంశ్రీవ) పేరు ఒక వెలుగులీనే నక్షత్రం. ఏడు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ ప్రస్థానంతో, ఆమె కేవలం ఒక లెజెండరీ ప్లేబ్యాక్ సింగర్ మాత్రమే కాదు, ప్రపంచ సంగీత రంగంపై చెరగని ముద్ర వేసిన ఒక సాంస్కృతిక చిహ్నమని చెప్పొచ్చు. ఒక సామాన్యురాలిగా ప్రారంభమై, ఒక సంగీత సామ్రాజ్ఞిగా తనని తాను మలుచుకున్నారు. ఆశా తాయి, దీదీగా సంగీత ప్రపంచానికి అమ్మగా మారారంటే ఆశ్చర్య పోవాల్సిన అవస రమే లేదు. ఆమె జీవితం లోని విశేషాలను చెప్పుకోవాలంటే.. మహారాష్ట్రలోని సాంగ్లీలో 1933, సెప్టెంబర్ 8న ఆశా భోంస్లే జన్మించారు. ఆమె తండ్రి పేరు పండిట్ దీనానాథ్ మంగేష్కర్. ఆయనొక శాస్త్రీయ సంగీత విద్వాంసుడు. ఆమె అక్క లతా మంగేష్కర్ అందరికీ సుపరిచితమే. భారతదేశపు గొప్ప నేపథ్య గాయనిగా లతా మంగేష్కర్ భారతరత్న పురస్కారాన్ని అందుకున్నారు. చిన్నతనం నుంచే శాస్త్రీయ సంగీతంలో శిక్షణ పొందిన ఆశా భోంస్లే, ప్లేబ్యాక్ సింగింగ్‌లో తనకంటూ ఒక ప్రత్యేకమైన శైలిని ఏర్పరచుకున్నారు. 1940లో మరాఠీ సినిమాలతో ఆశా ప్రయాణం మొదలైంది. మొదట్లో గీతా దత్, నూర్జహాన్ వంటి గాయనీమణుల ప్రభావం ఆమెపై ఉన్నప్పటికీ, 1950లలో సంగీత దర్శకుడు ఓ.పి. నయ్యర్ సారథ్యంలో ఆమె పాడిన పాటలను జనాలను మెప్పించారు. ఆశా భోంస్లేకు ఇదే టర్నింగ్ పాయింట్. ఆ పాటనే ఆమెను స్టార్‌ను చేశాయి. ఇక అక్కడి నుంచి ఆమె శకం మొదలైంది. 'ఉడే జబ్ జబ్ జుల్ఫేన్ తేరీ', 'ఆయియే మెహెర్బాన్' వంటి పాటలు ఆమె గొంతులోని వైవిధ్యాన్ని చాటిచెప్పాయి. ఆమె బహుముఖ ప్రజ్ఞాశాలి. హుషారైన క్యాబరే పాటల నుండి హృదయాన్ని తాకే గజల్స్ వరకు ఆమె ఏదైనా అలవోకగా పాడగలరు. హిందీ, బెంగాలీ, మరాఠీ, తెలుగుతో సహా అనేక భాషల్లో వేల సంఖ్యలో పాటలు పాడి.. అప్పట్లో సంగీత దర్శకుల మొదటి ఛాయిస్‌గా నిలిచారు.






# గోపీచంద్ కొత్త చిత్రం 'భరతవర్ష'



మాస్ హీరో గోపీచంద్ తన 33వ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ సినిమాకు 'భరతవర్ష : సాగా ఆఫ్ శూల' అనే శక్తివంతమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ, సోమవారం టైటిల్ గ్లింప్స్ వీడియోను విడుదల చేశారు. ఇందులో గోపీచంద్ మునుపెన్నడూ కనిపించని రీతిలో వారియర్ అవతారంలో ఆకట్టుకున్నారు. భీకర యుద్ధ సన్నివేశాలతో ఈ గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచింది.

ఈ చిత్రం 7వ శతాబ్దం నాటి అవిభక్త భారతదేశంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతోంది. చారిత్రక అంశాలకు పౌరాణిక నేపథ్యాన్ని జోడించి దర్శకుడు సంకల్ప్ రెడ్డి దీన్ని రూపొందిస్తున్నారు. గ్లింప్స్‌లో కనిపించిన గ్రాండ్ విజువల్స్, ఉత్కంఠభరితమైన నేపథ్య సంగీతం సినిమా స్థాయిని తెలియజేస్తున్నాయి. గోపీచంద్ కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాస్ చిట్టూరి నిర్మిస్తున్నారు. అనుదీప్ దేవ్ సంగీతం అందిస్తున్నారు.

ఈ సినిమాలో గోపీచంద్‌కు జోడీగా రీతూ వర్మ నటిస్తోంది. గత కొంతకాలంగా సరైన విజయం కోసం ఎదురుచూస్తున్న గోపీచంద్‌కు ఈ భారీ హిస్టారికల్ యాక్షన్ చిత్రం కమ్‌బ్యాక్ ఇస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు. విడుదల తేదీని త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నట్లు చిత్రబృందం తెలిపింది.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**